www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం


# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 44 | | 22-7-2026 | | బుధవారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |



## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధమే: ఇరాన్ అధ్యక్షుడు
- ప్రపంచవ్యాప్తంగా అమెరికన్లకు భద్రతా హెచ్చరికలు
- హోర్ముజ్ జలసంధి ఉద్రిక్తతతో చమురు సరఫరాపై ఆందోళన

వివరాలు 4లో..

## పాక్‌తో సింధూ జలాల ఒప్పందం



- ఇప్పుడున్నట్లుగా కొనసాగడం కుదరదు
- కృతనిశ్చయంతో ఉన్న కేంద్ర ప్రభుత్వం

4

## నీట్ పేపర్ లీక్‌పై స్పందించిన ప్రధాని

- పిల్లలను రెచ్చగొట్టదన్న మోడీ
- నిందితులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

4





### హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనుల్లో

# వేగం పెంచండి

### సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

వికారాబాద్ జిల్లా హకీంపేటలో నిర్మిస్తున్న కొడంగల్ ఎడ్యుకేషన్ హబ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇక నుంచి ప్రతి నెలా పనుల పురోగతిని స్వయంగా సమీక్షిస్తానని, అవసరమైతే ఒక రోజు నిర్మాణ ప్రాంగణంలోనే బస చేసి పనులను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. హకీంపేటలో నిర్మాణంలో ఉన్న కొడంగల్ ఎడ్యుకేషన్ హబ్‌ను సీఎం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్, వెటర్నరీ, ఫిజియోథెరపీ-పారా మెడికల్ కళాశాలలు, విద్యార్థుల వసతి గృహాల నిర్మాణ పనులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులు ఆశించిన వేగంతో సాగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

- ఇప్పటినుంచి ప్రతి నెలా పనుల పురోగతి తనిఖీ..
- నెలకో రోజు సైట్‌లోనే బస చేస్తా
- అలసత్వం వహిస్తే సస్పెన్షన్ తప్పదు..
- భూబాధితులకు వారంలోగా ప్లాట్ల పట్టాలివ్వాలి
- మక్తల్ - నారాయణపేట్ - కొడంగల్ ఎత్తిపోతల భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి
- కొడంగల్ నియోజకవర్గంలో రోడ్డు లేని తండా ఉండకూడదు.. తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికలు

వివరాలు 3లో..

## దేశ యువత కోసం రాహుల్ పోరాటం



హైదరాబాద్, జులై 21: యువత భవిష్యత్ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీ-ఛార్జీకి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రధాని నివాసం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ మద్దతుగా నిలిచారని చెప్పారు. యంగ్ ఇండియాకు కాంగ్రెస్ అండగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు.

# ప్రధాని నివాసం ముట్టడి

- రాహుల్ సహా నేతల అరెస్ట్
- నీట్ నిరసనలకు రాజకీయ మలుపు
- మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ ధర్నా
- రాహుల్, ప్రియాంక, ఖర్గే సహా పలువురు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు



'నీట్' పేపర్ లీక్ వ్యవహారంలో సోమవారం జంతర్ మంతర్ వద్ద ఆందోళన బాట పట్టిన విద్యార్థులపై జరిగిన పోలీసు లాఠీచార్జీకి నిరసనగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్, మిత్రపక్షాల నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వద్ద భారీ ధర్నా చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం చేపట్టిన ఈ ఆందోళనతో ప్రధాని నివాసం పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కేరళ సీఎం పినరాయి విజయన్‌లతో పాటు పలువురు ఇండియా కూటమి ఎంపీలు నిరసనలో పాల్గొన్నారు. విద్యార్థులపై అణచివేతకు నిరసనగా నాయకులు చేతులకు సంకెళ్లు వేసుకుని నినాదాలు చేశారు.

వివరాలు 4లో..

## కాళేశ్వరంపై ఇన్ని అబద్ధాలా?

నీళ్లు కిందికి పోతున్నా పట్టింపు లేదా

దేవాదుల విషయంలోనూ అదే ద్రోహం

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

మీడియా సమావేశంలో హరీష్ రావు



2



### దేవాదుల పంపులు ఇక

## 24 గంటలు పనిచేస్తాయి

- 9 పంపింగ్ యూనిట్లు పూర్తి సామర్థ్యంతో ప్రారంభం
- ప్రజలకు నీటి భద్రతే ప్రభుత్వ లక్ష్యం... రాజకీయాలు కాదు
- కాళేశ్వరం కాంట్రాక్టర్ల నుంచి బీఆర్ఎస్‌కు 1400 కోట్లు
- కవిత ఆరోపణలకు హరీశ్ రావు సమాధానం చెప్పాలి
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

3



జీహెచ్ఎంసీ ఎన్నికల కోసమే

## ఇళ్ల నాటకం

ప్రజల నుంచి పదివేల కోట్లు వసూళ్లకు పన్నాగం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శలు

3

డాక్టర్లు, అడ్వకేట్లు, జర్నలిస్టుల జేఏసీలతో

## ముఖాముఖి

- ఉద్యమకారుల సమగ్ర సంక్షేమానికి కార్పొరేషన్
- చట్టబద్ధత ఇవ్వాలని జేఏసీల డిమాండ్

3



### నలుగురు రైతులు చనిపోయినా

## బాధ్యత లేదా

- వారికి కనీసం రూపాయి కూడా పరిహారంగా ఇవ్వరా
- కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీసిన బీఆర్ఎస్ నేత కేటీఆర్
- పార్టీ తరఫున ఒక్కో కుటుంబానికి 5 లక్షల సాయం అందజేత

వివరాలు 3లో..



## ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

- ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో ఉన్నాం
- వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమిష్టిగా కృషి
- కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేయాలి
- హన్మకొండ కలెక్టరేట్‌లో సమీక్షించిన మంత్రి పొంగులేటి

2



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక





# నీట్ పేపర్ లీక్‌పై స్పందించిన ప్రధాని

## పిల్లలను రెచ్చగొట్టదన్న మోడీ

## నిందితులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**న్యూఢిల్లీ,జులై 21 :** నీట్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. పేపర్ లీక్ ఘోర పాపమని, ఇలాంటివి మళ్లీ జరగకూడదని వ్యాఖ్యానించారు. బాధ్యులకు కఠిన శిక్ష విధించాలని, ఇలాంటి లీక్‌లను నివారించడం జాతీయ బాధ్యత అని పేర్కొన్నారు. 'మంగళ్ మిలన్' పేరిట మంగళవారం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఈ మేరకు ప్రధాని మాట్లాడారు. ఆయన మాట్లాడిన అంశాలను కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలు జరిగేలా విపక్షాలు సహకరించాలి. రాజకీయంగా విభేదాలు ఉండొచ్చు. కానీ దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం కోసం కలిసి పనిచేయాల్సిన బాధ్యత ఎంపీలందరిపై ఉందని ప్రధాని సూచించారు. 'పిల్లలను రెచ్చగొట్టొద్దు. తప్పుడు మార్గంలోకి వెళ్లడం సులభం. కానీ తిరిగి సరైన మార్గంలోకి రావడం చాలా కష్టం. వారు సరైన మార్గంలో వెళ్లేలా చూసుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. దేశంలో ప్రధాన పోటీ పరీక్షల్లో ఒకటైన నీట్ (ఔఇఇ÷) మేలో నిర్వహించగా.. పేపర్ లీక్ ఆరోపణలతో జూన్‌లో మళ్లీ పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. సీబీఎస్ఈ 12వ తరగతిలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానంలోనూ లోపాలు వెలుగుచూశాయి. అలాగే మరికొన్ని లీకేజీ ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సంస్కరణలు అమలు చేయాలని డిమాండు చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన 'చలో పార్లమెంటు' తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వేల మంది సీజేపీ మద్దతుదారులు పార్లమెంటువైపు దూసుకురావడం, బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో దిల్లీ రణరంగాన్ని తలపించింది. ఈ నేపథ్యంలోనే మోదీ స్పందన వచ్చింది.

# సింగరేణి మెడికల్ బోర్డు ఫలితాలపై పునఃసమీక్ష

## యాజమాన్యానికి ఏఐటీయూసీ నేతల వినతి పత్రాలు

**కొత్తగూడెం, జులై 21:** ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలపై పునఃసమీక్ష చేపట్టి బాధిత కార్మికులకు న్యాయం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపు మేరకు మంగళవారం సింగరేణి వ్యాప్తంగా అన్ని మైన్స్, విభాగాల్లో వినతిపత్రాలు సమర్పించారు. పిలుపులో భాగంగా కొత్తగూడెం ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా సుమారు 2 వేల మంది కార్మికులు ఏళ్ల తరబడి మెడికల్ బోర్డు కోసం ఎదురు చూస్తుండగా, కేవలం 120 మందికి మాత్రమే బోర్డు నిర్వహించడం అన్యాయమని పేర్కొన్నారు. వారిలో 28 మంది కార్మికులకు మెడికల్ బోర్డుకు హాజరుకావాల్సిన సమాచారం కూడా సకాలంలో అందకపోవడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. హాజరైన 120 మంది కార్మికుల్లో కేవలం 24 మందిని మాత్రమే ఇన్వాలిడేషన్‌కు అర్హులుగా ప్రకటించడం గతంలో నిర్వహించిన మెడికల్ బోర్డులతో పోలిస్తే అత్యంత తక్కువ శాతమని తెలిపారు.

# పోలీసుల అదుపు నుంచి నిందితుడు పరార్

## బాధ్యులైన పోలీసులకు ఛార్జ్ మెమో

**నిజామాబాద్, జూలై 21:** పోలీసుల కళ్లుగప్పి ఓ నిందితుడు పరారయ్యాడు. తప్పించుకున్న ఒక నిందితుడి కోసం ఉన్న నిదితుడిని తీసుకుని బయలుదేరగా, అతను తప్పించుకున్నాడు. వివరాల్లోకి వెళితే..నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు శనివారం డ్రంక్ అండ్ తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో నంబర్ లేని బైక్ పై వచ్చిన ఇద్దరు అనుమానితులు పోలీసులను చూసి బైక్ అక్కడే వదిలేసి పరారయ్యారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు వారిని వెంబడించగా ఒకరు తప్పించుకుపోగా మరో అనుమానితుడు పోలీసులకు చిక్కాడు. దీంతో అతని తనిఖీ చేయగా అతడి వద్ద బంగారు గొలుసు లభించడంతో అనుమానితునితోపాటు, బైక్ ను సైతం తదుపరి విచారణ నిమిత్తం సీసీఎస్ (సెంట్రల్ క్రైమ్ స్టేషన్) పోలీసులకు అప్పగించారు. పోలీసుల అదుపులో ఉన్న సదరు నిందితుని విచారించగా అతడు కరీంనగర్ జిల్లా గంగాధర మండలానికి చెందినవాడిగా పోలీసుల విచారణలో అంగీకరించారు. అయితే సదరు నిందితుడి వెంట ఉండి పరారైన మరో అనుమానితుడు అతడి సమీప బంధువేనని పోలీసుల విచారణలో తేలింది. అయితే అదుపులో ఉన్న అనుమానితుడి వద్ద లభించిన బంగారు గొలుసు ఎక్కడికైనా విచారించగా నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండల పరిధిలో ఓ మహిళ వద్ద నుండి చోరీ చేసినట్లుగా సీసీఎస్ పోలీసుల విచారణలో అనుమానితుడు అంగీకరించినట్లు తెలిసింది. అయితే అతడి వెంట ఉండి పరారైనా మరో నిందితుడి వివరాలు అడగగా, పారిపోయిన నిందితుడు తన సమీప బంధువని పోలీసుల విచారణలో తెలిపాడు. పరారైన మరో నిందితుడిని పట్టుకునేందుకు పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిజామాబాద్ సిసిఎస్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తున్న ఓ సీఐ ఆధ్వర్యంలో బృందాన్ని కరీంనగర్ జిల్లాకు పంపించారు. తమ అదుపులో ఉన్న అనుమానుతుని వెంటబెట్టుకొని అక్కడి వరకు వెళ్లిన సీసీఎస్ టీం కండ్లు కప్పి ఆ దొంగ పరారైనట్లు తెలిసింది. పోలీసులకు పట్టుబడిన 24 గంటల వ్యవధిలోనే అనుమానితుడు వారి చెర నుండి పారిపోవడంతో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సీసీఎస్ బృందంపై సీరియస్ గా పరిగణించినట్లు తెలిసింది. అంతేకాకుండా క్రమశిక్షణ చర్యల్లో భాగంగా అనుమానితుడు పరారీకి బాధ్యులుగా చేస్తూ సీసీఎస్ సీఐ తో పాటు అతని వెంట వెళ్లిన సిబ్బందికి పోలీస్ బాస్ ఛార్జ్ మెమో ఇచ్చినట్లు పోలీస్ అధికారుల ద్వారా తెలిసింది.

# కాళేశ్వరంపై ఇన్ని అబద్ధాలా?

- నీళ్లు కిందికి పోతున్నా పట్టింపు లేదా
- దేవాదుల విషయంలోనూ అదే ద్రోహం
- రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్
- మీడియా సమావేశంలో మండిపడ్డ హరీష్‌రావు



**హైదరాబాద్, జులై 21:** కాళేశ్వరం దగ్గర చిల్లర రాజకీయం చేయడంపై సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. మరి దేవాదుల దగ్గర నీకు ఏం అడ్డమొచ్చిందని ప్రశ్నించారు. దేవాదుల విషయంలో నాటి నుంచి నేటి దాకా కాంగ్రెస్ పార్టీది ద్రోహమే అని మండిపడ్డారు. 2011లో మూడేళ్లు దేవాదులను మూలకు పడేసిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. ఎల్‌నినో పేరు చెప్పి ఎగనామం పెడితే బీఆర్ఎస్ ఊరుకోదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి బొట్టును ఒడిసి పట్టాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డికి ఉందని అన్నారు. మాట్లాడితే తిట్లు, ఒట్లు తప్ప ఏమీ లేదని మండిపడ్డారు. మొన్న రాములోరి మీద కూడా ఒట్టు పెట్టిండు అని తెలిపారు. ఒట్ల మీద ఉన్న శ్రద్ధ.. నీటి బొట్ల మీద పెట్టాలని హితవుపలికారు. లేదంటే చరిత్రహీనుడిగా మిగిలిపోవడం ఖాయమని హెచ్చరించారు. నీళ్లు రాకున్నా.. కరెంటు లేకున్నా రేవంత్ రెడ్డిదే బాధ్యత అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. జూన్ 1 నుంచి నేటి వరకు సమ్మక్క బ్యారేజీ నుంచి 105 టీఎంసీల నీరు కిందకు పోయిందని తెలిపారు. నీళ్లన్నీ ఆంధ్రాకు తరలిపోయాయని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం 1.9 టీఎంసీలు మాత్రమే ఎత్తిందని చెప్పారు. నాలుగు రోజులకు ఒక టీఎంసీ ఎత్తవచ్చని.. 50 రోజులకు 12 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉందని తెలిపారు. కానీ కనీసం రెండు టీఎంసీలు కూడా ఎత్తలేదని విమర్శించారు. ఇది నేరపూరిత నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. నీ ప్రభుత్వానికి ఏం శిక్ష వేయాలో నువ్వే చెప్పు అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఇన్ని నీళ్లు ఉంటే ఎత్తవా అని మండిపడ్డారు. ఇదేనా రైతులపై నీకు ఉన్న చిత్తశుద్ధి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న దేవాదులను నిర్వహించే సత్తా మీకు లేదా అని అడిగారు. మీ వైఫల్యం వల్ల వరంగల్ జిల్లా వ్యవసాయ సంక్షోభంలో మునిగిపోయిందని అన్నారు. వరంగల్, కరీంనగర్ జిల్లాలు ఆగమయ్యే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమే అని ఆరోపించారు. 22 రిజర్వాయర్ల కెపాసిటీ 12 టీఎంసీలు అని.. ప్రతిరోజు పావు టీఎంసీ ఎత్తవచ్చని తెలిపారు. అంటే ఇప్పటికి 12 టీఎంసీలు ఎత్తిపోయవచ్చని పేర్కొన్నారు. మరెందుకు 22 రిజర్వాయర్లు నింపలేదని ప్రశ్నించారు. దేవాదుల నుంచి 105 టీఎంసీలు కిందకు తరలిపోయాయని తెలిపారు. ఈ రోజు కూడా దేవాదులలో 78 మీటర్ల ఎత్తులో నది ప్రవహిస్తున్నదని పేర్కొన్నారు. 73 మీటర్లు ఉంటే చాలు మోటార్లు నడుస్తాయని.. 78 మీటర్లు ఉన్నప్పటికీ మోటార్లు నడిపించడం లేదని చెప్పారు. ఎందుకు నీళ్లు ఎత్తిపోయడం లేదని, ఏమిటీ నిర్లక్ష్యమని ప్రశ్నించారు. అతి తక్కువ వర్షపాతం పడిన జిల్లా వరంగల్ జిల్లా అని హరీశ్‌రావు తెలిపారు. రెయిన్‌ఫాల్ తక్కువ ఉంటే సమ్మక్క బ్యారేజీ నుంచి నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. ఎందుకు నీళ్లను కిందకు జారవిడుస్తున్నారని ప్రశ్నించారు. మేం ప్రెస్‌మీట్ పెట్టగానే.. దేవాదులలో రెండు మోటార్లు స్టార్ట్ చేశారని తెలిపారు. మేం ప్రశ్నిస్తే తప్ప నీళ్లు ఎత్తిపోయారా అని నిలదీశారు. ప్రధాన ప్రతిపక్షంగా రైతుల పక్షాన బాధ్యతాయుత పోరాటం చేస్తున్నామని మండిపడ్డారు. దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు స్టార్ట్ చేసి సాగునీటిని అందిస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పిన మాటలు నమ్మి రైతులు నారుమడులు పోసుకున్నారని తెలిపారు. ఇప్పుడేమో నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ మాత్రం నీళ్లు ఇమ్మని చెబుతున్నాడని అన్నారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని మండిపడ్డారు. ప్రపంచమంతా నీళ్లను కాపాడుకుంటే.. మీరు వృథా చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. పాకాల ప్రాజెక్టు కింద 29వేల ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి అక్కడి రైతులు నాట్లు వేసుకున్నారని, రామప్ప కింద కూడా నాట్లు వేసుకున్నారని పేర్కొన్నారు. రామప్ప కింద 5500 ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. నిన్న పాకాల కింద తూములు మూసేశారని పేర్కొన్నారు. నమ్మి నాట్లు వేసుకున్న రైతుల పరిస్థితి ఏంటి అని నిలదీశారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని హరీశ్‌రావు మండిపడ్డారు. రామప్ప కింద తూములు మూసేస్తే రైతుల పరిస్థితి ఏంటని నిలదీశారు. నీళ్లు ఎత్తకుండా కలెక్టర్ ఎందుకు తూములు మూసేయమని చెప్పాడని ప్రశ్నించారు. మంత్రులు చెప్పింది తప్పయితే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్రాప్ హాలీడే ప్రకటించి, రైతులకు డబ్బులు ఇవ్వాలన్నారు. పంటను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడతారని హరీశ్‌రావు తెలిపారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోసి నార్లు కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. బిందెలు, సీసాలతో పత్తికి బొట్టు బొట్టు నీళ్లు జల్లుకుంటున్నారని చెప్పారు. రైతులకు ఉన్న తపన, సోయి రేవంత్ రెడ్డికి లేదా అని మండిపడ్డారు. నీళ్ల కోసం తెలంగాణ రైతులు ఎంతో తపన పడుతున్నారని తెలిపారు. నీళ్ల ఎత్తిపోతల విషయంలో కూడా వాయిదాలు ఎందుకు అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేక నీళ్లు కిందకు విడిచిపెడుతున్నాడని మండిపడ్డారు.

# దేవాదుల పంపులు ఇక 24 గంటలు పనిచేస్తాయి

## 9 పంపింగ్ యూనిట్లు పూర్తి సామర్థ్యంతో ప్రారంభం

## ప్రజలకు నీటి భద్రతే ప్రభుత్వ లక్ష్యం... రాజకీయాలు కాదు

## కవిత ఆరోపణలకు హరీశ్ రావు సమాధానం చెప్పాలి

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, జూలై 21 :** దేవాదుల ఎత్తిపోతల పథకం కింద ఈ రాత్రి నుంచే 9 పంపింగ్ యూనిట్లు 24 గంటల పాటు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తాయని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో తనను కలిసిన మీడియాతో ఆయన చిట్-చాట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల దేవాదుల ప్రాజెక్టుపై మంత్రుల బృందం నిర్వహించిన సమీక్షలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. గోదావరి నుంచి వీలైనంత ఎక్కువ నీటిని ఎత్తిపోసి, దేవాదుల పరిధిలోని 9 జిల్లాలకు చెందిన 22 రిజర్వాయర్లను నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు పంపులను గరిష్ట సామర్థ్యంతో నడపాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీటి భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాజకీయ విమర్శలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. దేవాదుల ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేయడం మానేసి, కాళేశ్వరం ప్రాజెక్టులో తీసుకున్న నిర్ణయాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో మొదట రూపొందించిన షీట్ పైల్ ఫౌండేషన్ డిజైన్‌ను ఎందుకు మార్చి సెకెంట్ పైల్ ఫౌండేషన్ అమలు చేశారో హరీశ్ రావు వివరించాలని మంత్రి ప్రశ్నించారు. ఆ నిర్ణయం వల్లే ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు ఈ పరిస్థితికి చేరుకుందని అన్నారు. అలాగే, కాళేశ్వరం కాంట్రాక్టర్లు బీఆర్ఎస్‌కు రూ.1,400 కోట్లు చెల్లించారని ఎమ్మెల్సీ కే. కవిత చేసిన ఆరోపణలపై హరీశ్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. రైతులను తప్పుదోవ పట్టించడం మానేసి, ఆ ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని అన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. భూసేకరణ, అనుమతులు, నిర్మాణ పనులను వేగవంతం చేసి 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ÷-రాజెక్టు పూర్తయిన తర్వాత సుమారు 5.6 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తాగునీటి భద్రత కూడా గణనీయంగా మెరుగుపడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

## ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో ఉన్నాం

## వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమిష్టిగా కృషి

## కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేయాలి

## హన్మకొండలో సమీక్షించిన మంత్రి పొంగులేటి

**హన్మకొండ, జులై 21:** రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు. దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో పశు సంవర్థక రంగానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై వెంటనే సమగ్ర నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పైస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టడం ద్వారానే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడగలమని మంత్రి అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సామాజిక బాధ్యతతో పనిచేస్తే వర్షాభావ పరిస్థితులను విజయవంతంగా అధిగమించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, తెలంగాణ శాసనసభ డిప్యూటి స్పీకర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్, జూలై 21:** ఎల్ నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు తెలంగాణ సర్కార్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎల్ నినోపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి గ్రామంలో ఎల్ నినోపై అవగాహన కల్పించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతులకు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. పగటి పూట సోలార్ విద్యుత్ వినియోగం పెంచి ఆర్థిక భారం తగ్గిస్తామని చెప్పారు. ఎల్ నినో కారణంగా వర్షాకాలంలోనూ వేసవిలో ఉన్నంత విద్యుత్ డిమాండ్ ఉందని వివరించారు. గ్రిడ్ స్థిరత్వానికి స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాల వారీగా కూడా ఎల్ నినో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు.

# హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనుల్లో వేగం పెంచండి



- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- ఇప్పటినుంచి ప్రతి నెలా పనుల పురోగతి తనిఖీ..
- నెలకో రోజు సైట్‌లోనే బస చేస్తా
- అలసత్వం వహిస్తే సస్పెన్షన్ తప్పదు..
- భూబాధితులకు వారంలోగా ప్లాట్ల పట్టాలివ్వాలి
- మక్తల్ - నారాయణపేట్ - కొడంగల్ ఎత్తిపోతల భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి
- కొడంగల్ నియోజకవర్గంలో రోడ్డు లేని తండా ఉండకూడదు.. తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికలు

**వికారాబాద్/కొడంగల్:** వికారాబాద్ జిల్లా హకీంపేటలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'కొడంగల్ ఎడ్యుకేషన్ హబ్' నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను తీవ్రంగా ఆదేశించారు. ఇప్పటినుంచి ప్రతి నెలా పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో తానే స్వయంగా తనిఖీ చేస్తానని, తనిఖీల సమయంలో నెలకు ఒకరోజు నిర్మిస్తున్న సైట్‌లోనే బస చేస్తానని ప్రకటించారు. ఎడ్యుకేషన్ హబ్‌లో భాగమైన వివిధ విద్యా సంస్థల భవన నిర్మాణాలను, పరిసర ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికలను ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంజనీరింగ్, మెడికల్, నర్సింగ్, వెటర్నరీ, ఫిజియోథెరపీ మరియు పారా మెడికల్ కాలేజీలతో పాటు విద్యార్థుల హాస్టళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించి అధికారులకు కీలక సూచనలు చేశారు. కొడంగల్ ఎడ్యుకేషన్ హబ్ పనులు మందకొడిగా సాగుతుండటంపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన నెల వారీ పురోగతి నివేదికలను తనకు ఎప్పటికప్పుడు అందించాలని స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఎంతటి అధికారులైనా సహించేది లేదని, నిర్లక్ష్యంగా ఉంటే సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడొద్దని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎడ్యుకేషన్ హబ్ కోసం భూములు కోల్పోయిన రైతులకు పునరావాస ప్లాట్ల కేటాయింపులో జాప్యం జరగడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం, రాబోయే వారం రోజుల్లోగా అర్హులైన లబ్ధిదారులందరికీ ప్లాట్ల పట్టాలు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు.

### కడా పనులపై సమీక్ష:

అనంతరం ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. మక్తల్–నారాయణపేట్ – కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులపై అధికారులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షించారు. ఎత్తిపోతల ప్రాజెక్టు భూసేకరణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని, అవసరమైన సర్వేయర్ల నియామకంతో పాటు కావాల్సినంత బడ్జెట్ విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి తక్షణమే టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని స్పష్టం చేశారు. కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో సాగుతున్న వివిధ అభివృద్ధి పనులను శాఖల వారీగా సమగ్రంగా సమీక్షించారు.

### ఏ తండాలోనూ రోడ్డు లేదనే మాట వినిపించొద్దు:

నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి ఖచ్చితంగా బీటీ రోడ్డు అనుసంధానం ఉండాలని, కొడంగల్ ప్రాంతంలో రోడ్డు సౌకర్యం లేని తండా ఉందనే మాటే వినిపించకూడదని అధికారులను హెచ్చరించారు. నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలకు భవనాల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలని, పనుల పర్యవేక్షణకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి అధికారిని నియమించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం మరియు వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ పర్యటన, సమీక్షా సమావేశంలో స్థానిక ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డిలతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### దేశ యువత కోసం రాహుల్ పోరాటం

యువత భవిష్యత్ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జికి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రధాని నివాసం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ మద్దతుగా నిలిచారని చెప్పారు. యంగ్ ఇండియాకు కాంగ్రెస్ అండగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు.



# నలుగురు రైతులు చనిపోయినా బాధ్యత లేదా

## వారికి రూపాయి కూడా పరిహారంగా ఇవ్వరా

## కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీసిన కెటిఆర్

ఆదిలాబాద్, జూలై 21: ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెచ్చిన ధాన్యం 30 రోజులు, 60 రోజులైనా కొనేటోడు దిక్కు లేడు.. సంచులు ఇచ్చేటోడు దిక్కులేడు. ఈ దిక్కు దివానం లేని ప్రభుత్వంలో అన్నదాతకు దిక్కులేని పరిస్థితి వస్తే ఆ పంటను కాపాడుకునే ఆ కొనుగోలు కేంద్రం దగ్గరే కాపు కాసి ఉన్నప్పుడు గోడ కూలి నలుగురు రైతులు చనిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పంట కొనకపోవడం వల్ల గోడ కూలి ప్రాణాలు కోల్పోయిన నలుగురు రైతుల కుటుంబాలకు కేటీఆర్ ఆర్థిక సాయం అందించారు. మే 6న లక్షెట్టిపేట మండలంలో పంటలు కాపాడుకునేందుకు వెళ్లి మృత్యువాత పడిన నలుగురు రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 20 లక్షల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నలుగురు రైతులు చనిపోతే వారికి న్యాయం చేయాలని మా బీఆర్ఎస్ నాయకులు జీవన్ రెడ్డి, దివాకర్ రావు 8 గంటలు ధర్నా చేసినా.. దున్నపోతు మీద వాన పడ్డట్లు ప్రభుత్వం నుండి స్పందన రాలేదు. చివరికి ఏదో మొక్కుబడిగా ఒప్పుకున్నారు.. చూస్తాం.. చేస్తాం అని ఒప్పుకున్నరు.. కానీ ఈ రోజు వరకు దాదాపు 2 నెలలు గడిచిపోయినా స్పందన లేదు. కనీసం మానవత్వం అనే ఆలోచన కూడా లేదు. ఈ నలుగురు జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోయిన తర్వాత నాకు దివాకర్‌రావు, జీవన్ రెడ్డి కలిసి ఫోన్ చేశారు. అన్నా పార్టీ తరపున మనమైనా ఏమన్నా చెప్పాలే.. ఎందుకంటే రైతులు ఇలా ఇబ్బంది పడుతున్నారు.. వారికి అండగా నిలబడాలన్నారు. ఆ రోజు మేం వరంగల్‌లో ఉన్నం.. రైతు సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నాం. అదే రోజు ఈ బాధాకరమైన సంఘటన జరిగింది. వెంటనే కేసీఆర్‌ను అడిగినం. మంచిర్యాల జిల్లాలో జరిగిన ఈ విషాదానికి పార్టీ తరపున తప్పకుండా మనం అండగా నిలబడదాం.. ఒక్కో రైతుకు రూ.5 లక్షలు వెంటనే ప్రకటించాలని కేసీఆర్ చెప్పారన్నారు. ఇవాళ శోకసంద్రంలో ఉన్న రైతు కుటుంబాలను నేను అడిగిన. ప్రభుత్వం నుంచి ఏమన్నా వచ్చిందా అమ్మా అని అడిగిన. రెండున్నర నెలలు అయిపోయింది.. మంచిర్యాలలో ఉన్నది కాంగ్రెస్ ఎమ్మెల్యే.. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం. జరిగింది ఒక విషాదం.. ఏ రాజకీయ పరమైన హడావిడి లేదు.. ఏ ఆర్భాటం లేదు.. ఏ ఎన్నిక లేదు.. కానీ ప్రభుత్వం నుంచి స్పందన లేదు. నలుగురితో మాట్లాడుతుంటే ఒక్కొక్కరిది ఒక్కో బాధ. వాళ్లందరు చెప్పింది ఒక్కటే మాట.. ఇవాళ నలుగురు రైతులు చనిపోతే ఒక్క రైతుకు మాత్రమే రూ.5 లక్షలు వచ్చింది. అది కూడా ఎక్కడిది.. కేసీఆర్ పెట్టిన రైతు బీమా నుంచి రూ.5 లక్షలు ఇచ్చారు. కానీ మిగిలిన ముగ్గురికి రూ.5 లక్షలు కాదు కదా.. రూ.5 వేలు కాదు.. 5 పైసలు కూడా ప్రభుత్వం నుంచి సహాయం అందలేదని కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చేరుకున్న కేటీఆర్ లక్షెట్టిపేట సమీపంలోని అంకతిపల్లిలోని వాసవీ ఫంక్షన్‌హాలుకు చేరుకుని రైతు సదస్సులో పాల్గొన్నారు.



# హైకోర్టులో హైడ్రా కమిషనర్‌కు చేదు అనుభవం

## గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని సెక్యూరిటీ సూచన

## రంగనాథ్ వ్యవహార శైలిపై హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్, జూలై 21:** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో చేదు అనుభవం ఎదురైంది. వీఐపీలు ప్రవేశించే గేట్ నంబర్ 6 నుంచి కాకుండా, సామాన్య ప్రజలు ప్రవేశించే గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని రంగనాథ్‌కు సెక్యూరిటీ సిబ్బంది సూచించారు. దీంతో గేట్ నంబర్ 4 వద్ద సామాన్య ప్రజలు వాహనాలు పార్క్ చేసే స్థలంలో కారు పార్క్ చేసి, అక్కడి నుండి నడుచుకుంటూ కోర్టులోకి వెళ్లారు. కాగా, ప్రైవేట్ ఆస్తి వివాదంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారశైలిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఒకే అంశానికి సంబంధించి ఏకంగా మూడు కోర్టు ధికరణ పిటిషన్లు దాఖలవడం అత్యంత తీవ్రమైన విషయమని వ్యాఖ్యానించింది. కోర్టు ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘించడం వెనుక కారణమేమిటని నిలదీసింది. ప్రైవేటు ఆస్తిలో జోక్యం చేసుకోవద్దని స్పష్టమైన ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ వాటిని లెకచేయకుండా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించింది. కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన అలవాటుగా మారిందా? కోర్టు ధికరణనే పరిపాటిగా మార్చుకున్నారా? అంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒకటి కాదు, రెండు కాదు, ఒకే అంశంపై మూడు కోర్టు ధికరణ పిటిషన్లు దాఖలవుతున్నా యంటే కోర్టు ఉత్తర్వుల పట్ల ఎంత నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారో స్పష్టమవుతున్న దని ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టుల పట్ల ఎంత గౌరవం ఉన్నదో ఈ పరిణామాలే చెప్తున్నాయని పేరొంది. ఇకడ బాధితుడు పిటిషనర్ కాదని, స్వయంగా కోర్టేనని ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టు ఉత్తర్వులను ధికరించడం ఎంతమాత్రం సహించబోమని రంగనాథ్‌కు తేల్చిచెప్పింది. ప్రభుత్వమైనా, ప్రభుత్వాధికారులైనా చట్టానికి అతీతులు కాదని స్పష్టం చేసింది. నీటి వనరులు, నాలాలు, కాలువల పరిరక్షణ పేరుతో కోర్టు ఉత్తర్వులను పకనపెట్టి ప్రైవేటు భూముల్లోకి వెళ్లడం ఏ చట్టం ప్రకారం సమర్థనీయమని ప్రశ్నించింది. యజమాని అనుమతి లేకుండా ప్రైవేటు భూమిలో అడుగు పెట్టరాదన్న ప్రాథమిక సూత్రం తెలియదా అని నిలదీసింది. ప్రభుత్వ భూమిని రక్షించడమే లక్ష్యమైతే ప్రైవేటు వ్యక్తిపై పోలీసు ఫిర్యాదు ఎందుకు చేశారని ప్రశ్నించింది.



# డాక్టర్లు, అడ్వకేట్లు, జర్నలిస్టుల జేఏసీతో ముఖాముఖి

## ఉద్యమకారుల సమగ్ర సంక్షేమానికి పర్మినెంట్ కార్పొరేషన్

## చట్టబద్ధత ఇవ్వాలని జేఏసీల డిమాండ్

**హైదరాబాద్, జూలై 21:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సంప్రదింపులు కొనసాగిస్తోంది. మంగళవారం వైద్యులు, న్యాయవాదులు, విలేఖరులుసమక్షంలో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, అద్దంకి దయాకర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి పలువురు ప్రముఖ సామాజిక నాయకులు మరియు వివిధ వర్గాల అగ్రశ్రేణి ప్రతినిధులు హాజరయ్యారు, అల్లం నారాయణ (సీనియర్ జర్నలిస్ట్ నాయకులు), ఎమ్. రాజేందర్ రెడ్డి (అడ్వకేట్ జేఏసీ కన్వీనర్), ఎస్. సత్యం రెడ్డి (హైకోర్టు మాజీ ప్రెసిడెంట్), టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. సమావేశానికి తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత స్వయంగా హాజరై కమిటీకి తమ పూర్తి మద్దతును ప్రకటించారు. భారత స్వాతంత్య్ర సంగ్రామ సమయంలో నాటి ఉద్యమకారుల గుర్తింపు కొరకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పలు చారిత్రాత్మక జీవోల ప్రతులను కమిటీ ప్యానల్‌కు సమర్పించారు. జార్ఖండ్ తో పాటు ఇతర కొత్తగా ఏర్పాటైన రాష్ట్రాల్లో అమలు చేసిన ఉద్యమకారుల గుర్తింపు విధానాలను పరిశీలించి, తెలంగాణలో త్వరితగతిన అర్హుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. విజ్ఞప్తిపై కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు స్పందిస్తూ.. 'నేను జార్ఖండ్ రాష్ట్రానికి 3 సంవత్సరాల పాటు ఇన్ ఛార్జీగా పనిచేశాను. అక్కడ అమలైన విధానాలపై నాకు పూర్తి అవగాహన ఉంది. అంతకంటే మెరుగ్గా, నిబద్ధతతో తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం. అన్ని రాజకీయా పార్టీల నుండి, ప్రజా సంఘాల నుండి వచ్చే సలహాలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటాం' అని తెలిపారు. పర్మినెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ పోస్టులలో ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మిటీ సభ్యులు మాట్లాడుతూ.. జర్నలిస్టులు, డాక్టర్లు, అడ్వకేట్లు ఉద్యమంలో చురుగ్గా పాల్గొని రాష్ట్రాన్ని సాధించారని, వారి ప్రతి డిమాండ్ అత్యంత సమంజసమైనదని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో రికార్డ్ చేసిన ఆధారాల ద్వారా ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూస్తామని, ఈ విజ్ఞప్తులన్నింటినీ క్రోడీకరించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నివేదిస్తామని స్పష్టం చేశారు.

# జీహెచ్‌ఎంసీ ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

## భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శలు

**హైదరాబాద్, జులై 21:** జీహెచ్‌ఎంసీ ఎన్నికలు వస్తున్నాయనే ఇళ్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకం ఆడుతోందని బిజెపి దుయ్యబట్టింది. 7వేల ఇళ్లకు 10వేల దరఖాస్తులు వస్తాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.10వేల చొప్పున తీసుకుంటే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్ల రాబడి వస్తుందని, క్యూర్ పేరుతో ప్రజలకు ప్రభుత్వం పెయిన్ తెస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఎద్దేవా చేశారు. నాంపల్లిలో భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యూర్‌లో శాస్త్రీయ బద్ధమైన పన్నుల విధానం లేదు. ట్యాక్స్ దోపిడీతో ప్రజలపై భారం పడుతుంది. ఈ చట్టాన్ని రెసిడెన్షియల్ అసోసియేషన్లు వ్యతిరేకిస్తున్నాయి. ఇది సరైన చట్టం కాదు. ఎవరితోనూ చర్చించకుండా దీన్ని అమలు చేస్తున్నారు. ‹రాజీవ్ స్వగృహ పేరుతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిర్మించిన ఇళ్లు అలాగే ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేసి పేదలకు ఇవ్వాలి. క్యూర్‌పై వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నాకే చట్టాన్ని అమలు చేయాలన్నారు. రూ.వెయ్యి కోట్ల కోసం పేదల నుంచి రూ.10వేలు తీసుకోవడం సరికాదని రామచందర్‌రావు అన్నారు.

# ములుగు జిల్లాలో విస్తారంగా వర్షాలు

## జోరు వానలకు తెగిపోయిన రోడ్డు

**ములుగు, జూలై 21:** ములుగు జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల వృక్షాలు నేలకూలాయి. వాజేడు మండలంలోని జాతీయ రహదారి 163 పై ఇసుక వాగు బ్రిడ్జి వద్ద తాత్కాలిక రోడ్డు వర్షానికి తెగిపోవడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. ములుగు జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో పలుచోట్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లాలో సగటున 7.66 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాజేడు, వెంకటాపురం మండలాల్లో గరిష్ఠంగా 11 సెం.మీ.కు పైగా వర్షపాతం నమోదైంది. ఆయా చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురవడంతో చెరువులు, కుంటలు, వాగులు నిండుకుండను తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని పర్యవేక్షిస్తూ చర్యలు చేపడుతున్నారు.



ఉద్యమ కెరటం
బుధవారం 22 జూలై 2026



# ఉరుముతున్న యుద్ధమేఘాలు!

పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు మళ్లీ కమ్ముకోవడంతో ప్రపంచదేశాలు దిక్కుతోచని స్థితికి చేరాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కూడా మళ్లీ తీవ్రస్థాయికి చేరింది. నియంతల కారణంగా ప్రపంచానికి శాంతి లేకుండా పోతోంది. వాళ్లు,వాళ్లు కొట్టుకు చస్తున్నా ఫర్వాలేదు.. ఇందులో మిగతా దేశాలు తల్లడిల్లి పోతున్నాయి. ముఖ్యంగా అమెరికా మళ్లీ ఇరాన్‌పై భీకరదాడులుకు దిగుతోంది. ట్రంప్‌ను అంతమొందిస్తాం అంటూ ఇరాన్‌లో పోస్టర్లు కలకలం రేపుతున్నాయి. అలాగే ప్రపంచంలోని అమెరికన్లు జాగ్రత్తగా ఉండాలంటూ అమెరికా ప్రజలకు హెచ్చరికలు చేసింది. ఈ క్రమంలో యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చనుందన్న సంకేతాలు వస్తున్నాయి. దీంతో చమురు సమస్యలు మళ్లీ మొదటికి అన్నట్లుగా పరస్థితులు కనిపిస్తున్నాయి. ఇరాన్‌ను సర్వనాశనం చేసే వరకు వదలనని ట్రంప్ భీష్మించుకున్నారు. ఇప్పుడు ఇజ్రాయిల్ వెనక్కి తగ్గగా అమెరికానే యుద్దాన్ని ఎగదోస్తోంది. మరోవైపు అమెరికా భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ వేడెక్కింది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశం ప్రస్తుతం అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధం చేస్తోందని ప్రకటించారు. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసినా గట్టిగా బదులిస్తామని స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందం స్పష్టంగా ఉంది. అందులో ఎలాంటి సందిగ్ధత లేదు. ఒప్పందం చిన్నదే అయినా మొత్తం 14 క్లాజ్‌లు ఉన్నాయి. హర్మూజ్ జలసంధి భవిష్యత్ నిర్వహణ బాధ్యత ఇరాన్‌కే చెందుతుంది. ఈ అంశాన్ని ఒమన్‌తో పాటు ప్రాంతీయ దేశాలతో చర్చిస్తూ ముందుకు తీసుకెళ్తాం. ఒప్పందంలోని నిబంధనలు స్పష్టంగా ఉన్నందున, వాటిని ఉల్లంఘించడానికి అమెరికాకు ఎలాంటి అవకాశం లేదని తెలిపారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై సైనిక చర్యలు విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే సైనిక సామర్థ్యం అమెరికాకు ఉన్నప్పటికీ.. దాన్ని ఎక్కువ రోజులు అధీనంలో ఉంచుకోవడం అంత సులభం కాదని భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఒక వేళ ఆక్రమణకు దిగితే ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బుషెహర్ ప్రావిన్స్ తీరానికి 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ద్వీపం ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఫిబ్రవరి 28న మొదలైన యుద్ధం దాదాపు ఐదు నెలలు కావస్తోంది. అయినా అగ్గి చల్లారడం లేదు. ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ట్రంప్ మళ్లీమళ్లీ దాడులకు తెగిస్తున్నారు. తమ షరతులకు ఒప్పుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునే వరకు ఆ దేశంతో శాంతి ఒప్పందం కుదరదని ఆయన తెలిపారు. బాంబు దాడి కంటే దిగ్బంధనమే ఎక్కువ ప్రభావవంతంగా ఉంది. వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండ బోతోంది. వారు రాజీ పడాలనుకుంటున్నారు. నేను దిగ్బంధనాన్ని కొనసాగించడం వారికి ఇష్టం లేదు. ఎత్తివేయడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే వారు అణ్వాయుధాన్ని కలిగి ఉండడానికి వీల్లేదు' అని ట్రంప్ గతంలోనే స్పష్టం చేశారు.శాంతి ఒప్పందానికి చిల్లు పెట్టారని, ట్రంప్ చేస్తున్న బెదిరింపులపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది అమెరికా మోసపూరిత ప్రణాళిక ఓడిపోతుందని, దిగ్బంధనం ద్వారా దేశంలో అంతర్గత కలహాలను సృష్టించాలనే ట్రంప్ ప్రణాళిక ఎన్నటికీ సఫలం కాదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. ఏదేమైనా అమెరికా-ఇరాన్ మధ్య ప్రస్తుతానికి చర్చలు జరగడం లేదు. ఇకపై మంచివాడిగా ఉండను అని గతంలో ట్రంప్ చేసిన హెచ్చరికలు తాజా పరిస్థితికి అద్దం పడుతున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉన్న సున్నితమైన కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచదేశాలు కూడా పెద్దగా స్పందించడం లేదు. ఏ దేశం కూడా ఈ సుదీర్ఘ యుద్దానికి అడ్డుపడడం లేదు. ఇరాన్ చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ట్రంప్ భావిస్తున్నారు. అయితే ఇరాన్ ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. తాడోపేడో తేల్చుకునేదాకా వదిలేది లేదని హెచ్చరికలు చేస్తోంది. అలాగే అమెరికా స్థావరాలపై భీకర దాడులు చేస్తోంది. ఈక్రమంలో ఈ యుద్ధం ఇప్పట్లో ముస్తుందని అనుకోవడానికి లేదు. ప్రపంచదేశాలు ఏకమైతే తప్ప యుద్ధ పరిస్థితులను అదుపు చేయడం అసాధ్యంగా కనిపిస్తోంది.

# ప్రధాని నివాసం ముట్టడించిన కాంగ్రెస్

- రాహుల్ సహా నేతల అరెస్ట్
- నీట్ నిరసనలకు రాజకీయ మలుపు
- మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ ధర్నా
- రాహుల్, ప్రియాంక, ఖర్గే సహా పలువురు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు









**న్యూఢిల్లీ,జులై 21 :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం ముందు ఆందోళన చేసిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్, మిత్రపక్షాల ఎంపీలను పోలీసులు మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌లో ఉన్న ఎంపీలను కలిసేందుకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ వెళ్లారు. అయితే, పోలీసులు సోనియాగాంధీని లోపలికి అనుమతించలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. సోమవారం జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవ హారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్, మిత్ర పక్షాల ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ నిరసనలు ఉద్రిక్తతకు దారి తీయటంతో పోలీసులు బలవంతంగా వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాహుల్, ఖర్గే, ప్రియాంకలను అరెస్ట్ చేసి బలవంతంగా తరలించారు. ఇకపోతే మంగళవారం ఈ నిరసనలు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి. కాంగ్రెస్ నేతలు ప్రధాని నరేంద్రమోడీ నివాసం ముందు ధర్నా చేశారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌లు కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారు. విద్యార్థులపై దాడికి నిరసనగా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని పిలుపునిచ్చారు. అయితే కాంగ్రెస్ ధర్నా చేసిన ప్రాంతాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌తో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు వేర్వేరు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో వున్న ప్రియాంకా గాంధీ వాద్రాను కలిసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అక్కడికి చేరుకున్నారు. తొలుత ఆమెను లోపలికి పంపేందుకు పోలీసులు నిరాకరించారు. ఆ తర్వాత కాసేపటికి లోపలికి పంపడంతో ప్రియాంకను ఆమె కలిశారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌ను మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ ధర్నా వద్దకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ప్రధాని కార్యాలయ బాధ్యతలు చూస్తున్న జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రం ముందు రాహుల్ ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచారు. ఎట్టిపరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిన్న విద్యార్థులపై లాఠీఛార్జి చేసిన ఘటనపై పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం స్పందించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు తాము ఈ ఆందోళనలు ఆపేది లేదని, ఇక్కడి నుంచి కదిలేది లేదని రాహుల్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత దిల్లీ పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్ బలగాలు భారీగా మోహరించి ప్రధాని నివాసం ముందు ధర్నా చేస్తున్న నేతలందరినీ అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డిమాండ్లపై రాహుల్‌గాంధీ మాట మార్చారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విమర్శించారు. రాహుల్ సహా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోకముందు మీడియాతో ఆయన మాట్లాడారు. 'నీట్ అంశంపై లోక్‌సభలో చర్చించాలని తొలుత రాహుల్ కోరారు. దానిపై హామీ ఇస్తే ధర్నా విరమిస్తామన్నారు. పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడు మాట మార్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ఇలా మాట మార్చడం సరికాదు. రాహుల్ ప్రవర్తన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. యాగీ చేయడమే ఆయన ఉద్దేశం. రాజకీయ లబ్ది కోసమే రాహుల్ ప్రయత్నిస్తున్నారు. మా ప్రభుత్వం యువతకు అన్యాయం చేయదు'అని జితేంద్రసింగ్ అన్నారు.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధమే చేస్తున్నాం: ఇరాన్ అధ్యక్షుడు
- ప్రపంచవ్యాప్తంగా అమెరికన్లకు భద్రతా హెచ్చరికలు జారీ
- హోర్ముజ్ జలసంధి ఉద్రిక్తతతో చమురు సరఫరాపై ఆందోళన







**టెహ్రాన్/వాషింగ్టన్, జూలై 21:** అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణలు మరింత తీవ్రమవుతుండటంతో పశ్చిమాసియాలో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారింది. తమ దేశం ప్రస్తుతం అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధ పరిస్థితిని ఎదుర్కొంటోందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రకటించారు. మరోవైపు, పశ్చిమాసియాలో భద్రతా పరిస్థితులు దిగజారుతున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా పౌరులకు అమెరికా విదేశాంగ శాఖ ప్రత్యేక భద్రతా హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ మాట్లాడుతూ, ప్రస్తుతం యుద్ధం కేవలం సైనిక రంగానికే పరిమితం కాదని, ఆర్థిక రంగంలోనూ తీవ్రమైన పోరాటం కొనసాగుతోందని తెలిపారు. యుద్ధ పరిస్థితుల్లోనూ ప్రజల జీవనోపాధిని కాపాడడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా మారిందన్నారు. దేశ ప్రజలు ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకుని ప్రభుత్వానికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. గత కొద్ది రోజులుగా ఇరాన్‌లోని పలు కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులు కొనసాగిస్తుండగా, అందుకు ప్రతిగా గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా ప్రయోజనాలు, సైనిక స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడులు చేస్తోంది. ఈ పరిణామాలతో హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన ఈ మార్గంలో ఉద్రిక్తతల ప్రభావం అంతర్జాతీయ చమురు సరఫరాపై పడే అవకాశముందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ పౌరులకు అమెరికా విదేశాంగ శాఖ 'వరల్డ్‌వైడ్ కాషన్' పేరుతో ప్రత్యేక అడ్వైజరీ జారీ చేసింది. విదేశాలకు వెళ్లే అమెరికన్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అవసరం లేని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించింది. జనసమ్మర్థ ప్రాంతాలకు దూరంగా ఉండాలని, స్థానిక భద్రతా పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని, సమీపంలోని అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. అత్యవసర పరిస్థితుల్లో కుటుంబ సభ్యులతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని, స్థానిక అధికారుల సూచనలను అనుసరించాలని అమెరికా విదేశాంగ శాఖ సూచించింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ భద్రత, అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తుండటంతో ప్రపంచ దేశాలు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి.

# పాక్‌తో సింధూనదీ జలాల ఒప్పందం

- ఇప్పుడున్నట్లుగా కొనసాగడం కుదరదు
- కృతనిశ్చయంతో ఉన్న కేంద్ర ప్రభుత్వం



**న్యూఢిల్లీ, జూలై 21:** సింధూ జలాల ఒప్పందం ప్రస్తుత రూపంలోనే మళ్లీ అమల్లోకి వచ్చే అవకాశమే లేదని తెలుస్తోంది. ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించాల్సి వస్తే.. మార్పులు తప్పనిసరి అని భారత ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రదర్శిస్తోంది. అది కూడా పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని విడనాడితేనే సాధ్యమవుతుందని చెబుతోంది. ఈ మేరకు ప్రభుత్వవర్గాలను ఉటంకిస్తూ ఓ జాతీయ మీడియా కథనం పేర్కొంది. గతేడాది పహల్గాం దాడి తర్వాత భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు గట్టి బుద్ధి చెప్పింది. ఇరు దేశాల మధ్య ఆరు దశాబ్దాలకుపైగా ఉన్న సింధూజలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. అయితే.. ప్రస్తుతానికి ఆ ఒప్పందం నుంచి వైదొలగాలని ప్రభుత్వం ఆలోచించడం లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఏ అంతర్జాతీయ ఒప్పందమైనా దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నట్లు తేలితే.. ఒక సార్వభౌమ దేశంగా దానిని రద్దు చేసే హక్కు భారత్‌కు ఉందని పేర్కొన్నాయి. సింధూ జలాల విషయంలో భారత నిర్ణయం పాకిస్థాన్ చర్యలపైనే ఆధారపడి ఉంటుందన్నాయి. ఆ ఒప్పందం నిలిపివేసినప్పటి నుంచి ఉక్కిరిబిక్కిరి అవుతోన్న పాక్.. సింధూ జలాల్లో తమ వాటా తీసుకుంటే తీవ్రపరిణామాలు తప్పవని ప్రేలాపనలు చేస్తోంది. ఒప్పందం నిలిపివేత వల్ల ఆ దేశంలో నీటికొరత ఏర్పడుతోందని చేస్తోన్న ప్రకటనలను భారత్ ఖండిస్తోంది. నీటిని నిల్వ చేసే సామర్థ్యాలు లేకనే భారతదేశాన్ని నిందిస్తూ.. పాక్ తప్పుడు ప్రచారం చేస్తోందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. భారత్ పదేపదే ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ.. ఉగ్రవాదాన్ని అరికట్టడానికి దాయాది అర్థవంతమైన చర్యలు తీసుకున్న దాఖలాలు ఏవీ లేవన్నాయి. అదీగాక ఐక్యరాజ్యసమితి నిషేధిత జాబితాలో ఉన్న వ్యక్తులు పాక్‌లో బహిరంగ కార్యక్రమాల్లో కనిపిస్తున్నారని ఎండగట్టాయి. పశ్చిమ నదులైన జీలం, చినాబ్‌లపై జమ్మూకశ్మీర్‌లో నిర్మితమవుతున్న జల విద్యుత్ కేంద్రాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఆ ప్రాజెక్టులను ఆలస్యం చేసేందుకు ఒప్పందంలోని వివాదాల పరిష్కారాలకు సంబంధించిన నిబంధనలను పాక్ దుర్వినియోగం చేస్తోందని ప్రభుత్వ వర్గాలు ఆరోపించాయి. సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్ , పాకిస్థాన్‌ల మధ్య 1960లో ఒప్పందం కుదిరింది.

# సాదా బైనమా, భూభారతి దరఖాస్తు లను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు, తహసిల్దార్ల తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతిలో వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాదా బైనమాల క్రమబద్ధీకరణ క్రింద దరఖాస్తు చేసుకున్న వాటిని రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులు చాలా మండలాల్లో ఇంకా పెండింగ్ దశలో ఉన్నాయని, తిరస్కరించే దరఖాస్తులను తిరస్కరణకు గల కారణాలు నమోదు చేయాలని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఈనెల 25 లోగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ, ఎ.ఎస్.డి. జాబితాను రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తం కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

**రిమ్స్ బ్లడ్ బ్యాంక్ను సందర్శించిన డాక్టర్ మనోహర్**




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రక్తం కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని డాక్టర్ మనోహర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ బ్లడ్ బ్యాంక్ ను మంగళవారం సందర్శించి, అక్కడి సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా రక్త నిల్వలు, నిర్వహణకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రక్తనిధి కేంద్రంలో రక్త నిల్వలను మరింత పెంచాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో తరచూ రక్తదాన శిబిరాలు నిర్వహించి, అవసరమైన సమయంలో రక్తం కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన రోగులకు ఎలాంటి రిప్లేస్మెంట్ విధానం లేకుండా పూర్తిగా ఉచితంగా రక్త యూనిట్లు అందించాలని స్పష్టం చేశారు. రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఐటీడీఏ హెల్ప్ డెస్క్ సిబ్బంది, రిమ్స్ జనరల్ ఆసుపత్రి లైజనింగ్ ఆఫీసర్ పవార్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ బోరు వద్ద ట్రాన్స్ఫార్మర్ ధ్వంసం



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ బోరు వద్ద ఉన్న ట్రాన్స్ఫార్మర్ ను ధ్వంసం చేశారు. కొత్తకొండ ఆశమ్మకు చెందిన పొలంలోని బోరు వద్ద కొందరు రైతులు ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్ఫార్మర్ను దుండగులు పగలగొట్టి, అందులోని కాపర్ వైర్లు , కాయిల్, ఆయిల్ను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనతో కొత్తపల్లి శివారులోని కొన్ని ఎకరాల పొలాలకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఇప్పుడిప్పుడే వర్షాలు కురుస్తుండటంతో పొలాలకు అదనంగా నీరు పెట్టాల్సిన అవసరం ఉంది. ట్రాన్స్ఫార్మర్ లేకపోవడంతో నారుమడి ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే పెట్టుబడి పెట్టాం. వర్షం పడినా పొలానికి నీరు పెట్టాల్సి వస్తుంది. ట్రాన్స్ఫార్మర్ లేకపోవడంతో మాకు భారీ నష్టం జరుగుతుందని రైతులు వాపోయారు. ఘటన జరిగిన వెంటనే పోలీసులకు, విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు. ధ్వంసం చేసిన వ్యక్తులను వెంటనే పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యుత్ అధికారులు సకాలంలో స్పందించి కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని రైతులు కోరారు.

# మాజీ ఎమ్మెల్యే సమక్షంలో టీఆర్ఎస్లో చేరికలు




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మాజీ ఎమ్మెల్యే, బోథ్ నియోజకవర్గ ఇంచార్జి రాథోడ్ బాపురావు సమక్షంలో మంగళవారం పలువురు టీఆర్ఎస్ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బోథ్ మండలం కౌఠ(బి) గ్రామానికి చెందిన 50 మంది మహిళలు, 20 మంది పురుషులతో కలిపి 70 మందికి పైగా కార్యకర్తలు టీఆర్ఎస్లో చేరారు. ఈ సందర్భంగా రాథోడ్ బాపురావు పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయడంతో పాటు గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పార్టీ కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో టీఆర్ఎస్ పార్టీకి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని, భవిష్యత్తులో మరింత మంది నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన కార్యకర్తలు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొనాల మండల కన్వీనర్ సదానందం, దిటి మోహన్, పొంకంటి ఊషన్న, బంద్రకంటి లింగన్న, దిటి పోతన్న, రాకేష్, పాలేపు గోపి తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ విశ్వ ధర్మక్షేత్రంలో ఉచిత హోమియో వైద్య శిబిరం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** మండలంలోని బుగ్గపాడు గ్రామంలోని శ్రీ విశ్వ ధర్మక్షేత్రం శివాలయం ప్రాంగణంలో డాక్టర్ రవిచంద్ర (కొత్తగూడెం) ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలకు అనుగుణంగా హోమియో చికిత్స అందించడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరానికి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, చిన్నారులు, మహిళలు, వృద్ధులు సహా పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య సేవలను పొందారు. ప్రతినెలా ఒకసారి ఈ ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని గ్రామస్తులు పేర్కొంటూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ విశ్వ ధర్మక్షేత్రం వ్యవస్థాపకులు, ఆగమ వాస్తు జ్యోతిష్య సిద్ధాంతి వెల్లటూరి ప్రసాదాచారి మాట్లాడుతూ మారుతున్న జీవన విధానంలో హోమియో వైద్యం ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. సహజమైన చికిత్స విధానాలపై ప్రజలు మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం శ్రీ విశ్వ ధర్మక్షేత్రం ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలకు సేవలందించిన డాక్టర్ రవిచంద్రతో పాటు వైద్య శిబిరం నిర్వాహకులను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పవన్, వేద పాఠశాల విద్యార్థులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు





**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లి కార్జున ఖర్గే జన్మదిన వేడుకలను సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మల్లి కార్జున ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మరింత బలోపేతం కావాలని, ప్రజాసేవలో కాంగ్రెస్ ఎల్లప్పుడూ ముందుండాలని నాయకులు ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్ మట్టా దయానంద్ సత్తుపల్లి పట్టణంలోని లలిత కుమారి హాస్పిటల్ రోడ్డులో ఉన్న బీసీ బాలుర హాస్టల్ను సందర్శించారు. హాస్టల్లోని భోజనశాల, విద్యార్థుల వసతి గదులు, బాత్రూములు, క్రీడా ప్రాంగణం, భవనం తదితర సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో సత్తుపల్లి మున్సిపల్ చైర్పర్సన్ రిహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత వేణు, కౌన్సిలర్లు విరివాడ అపర్ణ భూషణం, గ్రాండ్ మౌలాలి, శరత్ చంద్ర, సత్తుపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి

- **జగదాంబ ఆలయ ప్రాంగణంలో నూతన బోర్వెల్ ప్రారంభం**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ (ఇచ్చోడ):** ఇచ్చోడ మండలంలోని సాత్ నంబర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని సర్పంచ్ రమేష్ నాయక్ అన్నారు. గ్రామంలోని జగదాంబ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన బోర్వెల్ను ఉప సర్పంచ్ షబ్బీర్తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ఈ బోర్వెల్ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఆలయాల వద్ద అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ నాయకత్వంలో గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, వాటికి వార్డ్ సభ్యులు, గ్రామస్థుల నుంచి పూర్తి సహకారం లభిస్తోందని తెలిపారు. గ్రామ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వేగంగా పరిష్కరిస్తున్న సర్పంచ్ రమేష్ నాయక్ను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రిమ్స్ లో మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం రిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్ ఛాంబర్లో వివిధ విభాగాల అధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిమ్స్కు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వివిధ విభాగాలకు అవసరమైన అత్యవసర వైద్య పరికరాలను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశ నిర్ణయాలకు అనుగుణంగా ప్రస్తుతం వివిధ విభాగాలకు అత్యవసరంగా అవసరమైన పరికరాల తుది జాబితాను సిద్ధం చేసినట్లు వివరించారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, యూరాలజీ, ఈఎన్టీ, అనస్థీషియా, ఆర్థోపెడిక్స్, డెంటల్, ఆప్తాల్మాలజీ, సైకియాట్రీ, క్యాజువాల్టీ, డయాలిసిస్ విభాగాలకు అవసరమైన వైద్య పరికరాల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. పరికరాల అందుబాటుతో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దీపక్ పుష్కర్, వివిధ విభాగాల హెచ్ఓడీలు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణకే ప్రాధాన్యత

## ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియకే తాను పూర్తి ప్రాధాన్యత ఇస్తున్నానని, ఈ కార్యక్రమానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకే తన జన్మదిన వేడుకలకు దూరంగా ఉంటున్నానని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఆగస్టు 3వ తేదీ వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తమ గ్రామాలు, మండలాల్లో అందుబాటులో ఉండి ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, ఒక్క ఓటు కూడా గల్లంతు కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందన్నారు. గత సర్పంచ్ ఎన్నికల్లో సిర్సన్న గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి కేవలం ఒక్క ఓటు తేడాతో ఓడిపోయిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రతి ఓటు విలువైనదని అన్నారు. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చి రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా, రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చేయడమే లక్ష్యంగా అందరూ సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తన పుట్టినరోజు వేడుకలు నిర్వహించకుండా ప్రజలకు అందుబాటులో ఉండి ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొనడమే తనకు ఇచ్చే గొప్ప కానుక అని పేర్కొన్నారు. ఇటీవల జిల్లాలో కురుస్తున్న వర్షాలపై హర్షం వ్యక్తం చేసిన శ్రీకాంత్ రెడ్డి, తాంసి మండల పర్యటనలో రైతుల ఆనం దాన్ని ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. నీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ వర్షాలు ఊరటనిచ్చాయని, సకాలంలో వర్షాలు కురిసి రైతాంగం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకుడు ఎస్.కె. అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సదస్సుకు తరలిన బీఆర్ఎస్ నాయకులు



**ఉద్యమ కెరటం, తాండూర్:** లక్షెట్టిపేట మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సుకు తాండూర్ మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ రైతు సదస్సుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై ఇటీవల ప్రభుత్వ పంట కొనుగోలు కేంద్రాల్లో పంటను కాపాడుకునే క్రమంలో మృతి చెందిన నలుగురు రైతుల కుటుంబాలకు తన వ్యక్తిగతంగా ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించనున్న నేపథ్యంలో తాండూర్ మండల బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. సదస్సుకు హాజరైన వారిలో తాండూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.దత్తుమూర్తి, నాయకులు ఎలుక రాంచందర్, మసాడి శ్రీరాములు, గట్టు సంతోష్ కుమార్, మొగిలి శంకర్, సాత్ బాబా, అడ్వాల సత్యనారాయణ, బాబు ఖాన్, వేల్పుల శంకర్తో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు





- రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్లోని రాష్ట్ర సచివాలయం నుంచి అదనపు కార్యదర్శి ఇలంబర్తి, శాంతిభద్రతలు, రవాణా, రహదారులు–భవనాలు, జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్ట ర్లు పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారులపై ప్రమాదాలు తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టా లని సూచించారు. జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాలను ప్రతినెల నిర్వహించి, టాస్క్ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్స్పాట్లను గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులకు తక్షణ వైద్యసేవలు అందేలా అంబులెన్స్లను అందుబాటులో ఉంచాలని, ప్రమాదం జరిగిన వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్బెల్ట్ తప్పనిసరిగా ధరించేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. రహదారి భద్రత కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, ప్రమాదాలు జరిగే బ్లాక్స్పాట్లను గుర్తించి భద్రతా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో డీసీపీ ఎ.భాస్కర్, రవాణా, రహదారులు–భవనాలు, జాతీయ రహదారులు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ను బర్తరఫ్ చేయాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ(బోథ్):** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ను వెంటనే కేంద్ర మంత్రి మండలి నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి డిమాండ్ చేశారు. మంగళవారం బోథ్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా పార్లమెంట్ వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించిన విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం ప్రజాస్వామ్య భారతదేశంలో మాయని మచ్చగా నిలిచిపోతుందని విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశ యువతకు, విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే నీట్ పేపర్ లీకేజీ బాధితులకు న్యాయం జరిగేలా స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. ఎన్టీఏ పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించి అవసరమైన సంస్కరణలు చేపట్టాలని, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, సాంకేతిక భద్రతను పెంచాలని సూచించారు. పేపర్ లీకేజీలను పూర్తిగా అరికట్టేందుకు కఠినమైన చట్టాలు, సమర్థవంతమైన వ్యవస్థను అమలు చేయాలని, విద్యార్థుల ప్రతిభ, కృషి, భవిష్యత్తుకు భరోసా కల్పించేలా పరీక్షా విధానాన్ని బలోపేతం చేయాలని అన్నారు. విద్యార్థి సంఘాలతో కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి వారి ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని, సామాజిక కార్యకర్త సోనం వాంగ్చుక్ను పోలీసుల అదుపు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలి

## అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలోని కేజీబీవీల్లో విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా పౌష్టికాహారం, పరిశుభ్రమైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్ట ర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య ఆదేశించారు. మంగళవారం హాజీపూర్ మండలం కర్ణమామిడి, లక్షెట్టిపేట, దండేపల్లి మండలం కర్ణపేటలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల పరిశుభ్రత, తరగతి గదులు, వసతి గృహాలు, భోజనశాల, వంటశాల, తాగునీటి సౌకర్యాలు, విద్యార్థినులకు అందిస్తున్న భోజన నాణ్యత, విద్యాబోధన, హాజరు రిజిస్ట ర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడి బోధన, వసతులు, భోజన నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు, స్కూల్ కాంప్లెక్స్ పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలలు, వసతి గృహాలు, గ్రామాల్లో పరిశుభ్రతను కట్టు దిట్ట ంగా నిర్వహించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాగునీటి పైప్లైన్లలో లీకేజీలు లేకుండా చూసి క్లోరినేషన్ చేసిన సురక్షిత నీటిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. హాజీపూర్ మండలంలోని కర్ణమామిడి గ్రామపంచాయతీని సందర్శించి మురుగు కాలువల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అవసరమైతే ఆయా కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లక్షెట్టిపేట కేజీబీవీ వద్ద వీధిదీపాలు పనిచేయడం లేదని గుర్తించి, వెంటనే విద్యుత్ శాఖ అధికారులను పిలిపించి మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ కమిషనర్ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి సుమన్, మండల విద్యాధికారులు, ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు, సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు, పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యుత్ శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# ఘనంగా భాగవత సప్తాహ వేడుకలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** భాగవత సప్తాహ వేడుకల్లో భాగంగా మంగళవారం శ్రీకృష్ణ జనన ఘట్టాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో కన్నులపండుగగా జరుపుకున్నారు. మండలంలోని అచలాపూర్ గ్రామంలో ఈనెల 17 నుంచి 24 వరకు నిర్వహించే భాగవత సప్తాహ వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణ జనన సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ కు చెందిన ఫణతుల మేకరాజ్ శర్మ చెప్పబడుతున్న భాగవత సప్తాహ వేడుకల్లో చెరసాలలో దేవకీ వసుదేవులకు శ్రీకృష్ణ పరమాత్ముడు అర్ధరాత్రి జన్మించిన వృత్తాంతాన్ని ప్రవచకులు వివరించగా, గోకులంలో నందయశోదల ఆనందాన్ని కీర్తిస్తూ భక్తులు నృత్యాలు, భజనలతో మార్మోగించారు. ప్రవచనాలు, శ్రీమద్భాగవతంలోని దశమ స్కంధం ఆధారంగా కృష్ణ జన్మలీలలను వివరించారు. అర్ధరాత్రి వేళ ప్రత్యేక పూజలు, హారతులు, నామసంకీర్తనలు చేపట్టారు. ఉట్టి కొట్టడం, పాలు, పెరుగుతో వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అనధికారికంగా పత్తి విత్తనాల విక్రయం

### సర్పంచ్ సస్పెన్షన్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఇచ్చోడ మండలంలోని దాబా(బి) గ్రామ పంచాయతీ సర్పంచ్ నారవతే ఈశ్వర్ సస్పెండ్ అయ్యారు. తన విధులను విస్మరించి రైతులకు అనధికారికంగా పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. దాబా(బి) గ్రామానికి చెందిన సర్పంచ్ నారవతే ఈశ్వర్ అనధికారికంగా పత్తి విత్తనాలు విక్రయిస్తుండగా, 34 బస్తాలను టాస్కోర్స్ టీమ్ స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్లో నమోదు చేసింది. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఇచ్చోడ నివేదిక, జిల్లా వ్యవసాయ అధికారి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 ప్రకారం సర్పంచ్కు జారీ చేసిన షోకాజ్ నోటీసుకు ఆయన సమర్పించిన వివరణ అసంతృప్తికరంగా ఉండటంతో పాటు క్రిమినల్ కేసు నమోదవుతుండటంతో, సర్పంచ్ పదవిలో కొనసాగకుండా తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సంబందిత అధికారులు తెలిపారు.

## విద్యతోనే సమాజంలో గుర్తింపు





**ఉద్యమ కెరటం, జైనూర్:** విద్యతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, విద్యార్థులు ఇష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలని ఆశేపల్లి సర్పంచ్ మరప రవీందర్ అన్నారు. మండలంలోని ఆశేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యంగ్ ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యా సామాగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, స్టీల్ ప్లేట్లు, యూనిఫాం వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడే ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. అందించిన విద్యా సామాగ్రిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో ప్రతిభ కనబరాచలని ఆకాంక్షించారు. కాగా యంగ్ ఇండియా ఆర్గనైజేషన్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించి, వారి సేవాభావానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సునీల్, వార్డు సభ్యురాలు మాధవి బోజ్జ, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య





**ఉద్యమ కెరటం, మందమర్రి:** పెళ్లి కావడం లేదని మనస్థాపానికి గురై మందమర్రి మండలంలోని అందుగులపేట గ్రామానికి చెందిన కొమ్ము రాజు (32) అనే యువకుడు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మృతుడు ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడని, ఎన్ని సంబంధాలు వచ్చినా పెళ్లి కుదరకపోవడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరి లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడి తమ్ముడు కొమ్ము సాగర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## భారీ వర్షా లతో పంటలకు ఊరట

### జలాశయాల్లో కి చేరుతున్న వరద నీరు

### హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలో కురిసిన భారీ వర్షాలు రైతుల్లో కొత్త ఆశలను నింపాయి. గత కొద్ది రోజులుగా వర్షా ల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు ప్రకృతి వరం లభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా చెరువులు, కుంటలు, వాగులు నీటితో కళకళలాడుతుండగా, భూగర్భ జలమట్టం కూడా పెరిగే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికే సాగులో ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ తదితర పంటలకు ఈ వర్షాలు ఎంతో మేలు చేయనున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నీటి కొరతతో ఆందోళన చెందిన రైతులకు ఈ వర్షాలు ఊరటనిచ్చాయని, వర్షాలు ఇదే విధంగా కొనసాగితే పంట దిగుబడులు పెరిగి మంచి ఆదాయం వచ్చే అవకాశముందని తెలిపారు. అయితే భారీ వర్షాల నేపథ్యంలో పొలాల్లో నీరు నిల్వ కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్న సాగు విధానాలను పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తంగా ఈ వర్షాలు వ్యవసాయ రంగానికి కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ





- బ్లాక్ స్పాట్ల తొలగింపు, నిరంతర పెట్రోలింగ్కు ఆదేశాలు
- వీడియో కాన్ఫరెన్స్లో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నియంత్రణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రవాణా, రోడ్లు-భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ స్పష్టం చేశారు. రోడ్డు భద్రత చర్యలపై మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారుల వెంట నిర్దేశిత ప్రాంతాలు మినహా భారీ వాహనాలు, ట్రక్కులు ఎక్కడా పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారులపై ఆక్రమణలను తొలగించి, ట్రాఫిక్కు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, పోలీసులు, రవాణా శాఖ, జాతీయ రహదారుల అధికారులతో ప్రత్యేక టాస్కోర్స్ బృందాలను ఏర్పాటు చేసి, జాతీయ రహదారులపై నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. పెట్రోలింగ్ వాహనాల్లో అత్యవసర సేవలకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు జిల్లాలోని అన్ని ఆసుపత్రులు, ట్రామా కేర్ సెంటర్ల వివరాలను మ్యాపింగ్ చేసి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే వైద్య సేవలు అందేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. అలాగే ప్రమాదాలకు కారణమవుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ రోడ్డు భద్రతకు సంబంధించిన ప్రభుత్వ ఆదేశాలను జిల్లాలో ఖచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు ఆర్ఎస్. చిత్రూ, రాజేశ్వర్, రవాణా శాఖ అధికారి కిషోర్ బాబు, జిల్లా వైద్యాధికారి సాధన, రోడ్లు-భవనాల శాఖ, పోలీసు, నేషనల్ హైవే శాఖల అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వర్షా కాలంలో పారిశుధ్యమే ఆరోగ్యానికి రక్షణ





**ఉద్యమ కెరటం, జైనూర్:** వర్షాకాలంలో గ్రామ ప్రజలు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, పారిశుధ్యాన్ని పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని జైనూర్ మండలం జంగం గ్రామ ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ సూచించారు. మంగళవారం గ్రామంలోని పలు వీధులు, కాలనీలను సందర్శించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాల కారణంగా ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీలు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో చెత్తను పేరుకుపోనీయకుండా నిర్ణీత ప్రదేశాల్లోనే వేయాలని, దోమల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. అలాగే పరిశుభ్రమైన తాగునీటిని వినియోగించాలని, చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. గ్రామ పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని, ప్రజలందరూ సహకరిస్తేనే ఆరోగ్యవంతమైన గ్రామాన్ని నిర్మించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ జాదవ్ సురేఖ పాల్గొన్నారు.

## సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు రోడ్డు భద్రత చర్యలు అమలు చేయాలి





### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల మేరకు జిల్లాలో రోడ్డు భద్రతకు సంబంధించిన అన్ని చర్యలను పకడ్బందీగా అమలు చేసి రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో డీసీపీ ఎ.భాస్కర్తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర రహదారులపై అనుమతించిన లే-బైలు, వే-సైడ్ సౌకర్య కేంద్రాలు మినహా ఇతర ప్రాంతాల్లో భారీ, వా ణిజ్య వాహనాల పార్కింగ్ను పూర్తిగా నిషేధించాలని సూచించారు. దాబాలు, హోటళ్లు, వాణిజ్య సంస్థల సమీపంలో అక్రమ పార్కింగ్పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న బ్లాక్స్పాట్లను గుర్తించి అక్కడ వీధిదీపాలు, సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, రంబుల్ స్ట్రిప్పు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందారం వంతెన నుంచి గోదావరి వంతెన వరకు వీధి దీపాల ఏర్పాటు, ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నిర్వహణ, యూ-టర్న్ల పునర్వ్యవస్థీకరణ, రహదారుల షోల్డర్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అధునాతన ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థ, జీపీఎస్ ఆధారిత నిఘా వ్యవస్థల ద్వారా ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించి ఈ-చలాన్ వ్యవస్థతో అనుసంధానం చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రతి 75 కిలో మీటర్లకు అంబులెన్స్, రికవరీ వాహనం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారి హక్కు పరిధిలో కొత్త దాబాలు, వాణిజ్య నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకుండా, ఇప్పటికే ఉన్న అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలను తొలగించాలని సూచించారు. డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ రహదారి భద్రతను బలోపేతం చేసేందుకు పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక హైవే సర్వెలెన్స్ బృందాలను ఏర్పాటు చేసి 24 గంటల పర్యవేక్షణ నిర్వహిస్తామని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, హెల్మెట్, సీట్బెల్ట్ వినియోగం, రాంగ్రూట్ డ్రైవింగ్, ఓవర్లోడ్ వాహనాలు, అక్రమ పార్కింగ్ వంటి ఉల్లంఘనలపై నిరంతర తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వ 'రాహ్ వీర్' పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాద బాధితులను ప్రమాదం జరిగిన తొలి గంటలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వారికి కేంద్ర ప్రభుత్వం నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రం అందజేస్తుందని తెలిపారు. ప్రమాద బాధితులకు సహాయం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు-భవనాలు, పోలీసు, మున్సిపల్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రేపు సత్తు పల్లిలో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

**ఉద్యమ కెరటం, సత్తు పల్లి:**
తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి మల్లుభట్టి విక్రమార్క గురువారం సత్తుపల్లి సమీపంలోని సింగరేణి జేవీఆర్ ఓపెన్కాస్ట్-2 గనులను సందర్శించనున్నారు. గనుల పనితీరు, బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, భద్రతా చర్యలు, నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు జేవీఆర్ ఓపెన్కాస్ట్-2 గనులకు చేరుకోనున్న ఉప ముఖ్యమంత్రి ముందుగా సింగరేణి ఉన్నతాధికారులతో సమావేశమవుతారు. అనంతరం మధ్యాహ్నం 12.10 గంటల నుంచి 2.30 గంటల వరకు గనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి బొగ్గు ఉత్పత్తి విధానం, ఉత్పత్తి సామర్థ్యం, నాణ్యత ప్రమాణాలు, భద్రతా ఏర్పాట్లు, యంత్రాల పనితీరు, గనుల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి బొగ్గు ఉత్పత్తి పెంపు, భద్రతా ప్రమాణాల అమలు, గనుల సమర్థ నిర్వహణ, కార్మిక సంక్షేమానికి సంబంధించిన అంశాలపై అవసరమైన సూచనలు చేయనున్నట్లు సమాచారం. రాష్ట్ర ఇంధన రంగ అభివృద్ధిలో సింగరేణి కీలకపాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. అనంతరం మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు రిజర్వ్ సమయం ఉండగా, మధ్యాహ్నం 3.30 గంటలకు ఉప ముఖ్యమంత్రి సత్తుపల్లి నుంచి రోడ్డు మార్గంలో కొత్తగూడెం బయల్దేరనున్నారు.

# ఫిల్టర్ కాఫీ తాగితే వృద్ధాప్యం ఆలస్యమవుతుందా ?

# తాజా అధ్యయనంలో ఆసక్తికర ఫలితాలు..

ప్రపంచవ్యాప్తంగా ఎంతో మందికి ఉదయం నిద్ర లేవగానే కాఫీ తాగే అలవాటు ఉంటుంది. అయితే రోజూ తాగే కాఫీ ఎలా తయారవుతుందనే విషయం కూడా శరీర వృద్ధాప్యంపై ప్రభావం చూపుతుందా? తాజాగా ఎన్పీజే సైన్స్ ఆఫ్ ఫుడ్ జర్నల్‌లో ప్రచురితమైన కొత్త అధ్యయనం ఈ ప్రశ్నకు ఆసక్తికరమైన సమాధానం ఇచ్చింది. యూకే బయోబ్యాంక్‌కు చెందిన దాదాపు 50 వేల మంది వ్యక్తుల డేటాను విశ్లేషించిన పరిశోధకులు, ఫిల్టర్ కాఫీ తాగే వారిలో జీవసంబంధిత వృద్ధాప్యం నెమ్మదిగా ఉండే సూచనలు కనిపించగా, ఇన్‌స్టంట్ కాఫీ తాగే వారిలో వేగంగా వృద్ధాప్యం జరిగే సూచనలు కనిపించాయని వెల్లడించారు. అంటే కాఫీ పరిమాణం మాత్రమే కాకుండా, దాన్ని తయారు చేసే విధానం కూడా ఆరోగ్యకరమైన వృద్ధాప్యంతో సంబంధం కలిగి ఉంటుందని అధ్యయనం వెల్లడించింది.



### వ్యక్తులను బట్టి మారే అవకాశం..

అయితే నిపుణులు ఈ ఫలితాలను చూసి వెంటనే నిర్ణయాలకు రావద్దని హెచ్చరిస్తున్నారు. ఇది పరిశీలనా ఆధారిత, క్రాస్-సెక్షనల్ అధ్యయనం మాత్రమే. కాబట్టి ఫిల్టర్ కాఫీ వృద్ధాప్యాన్ని తగ్గిస్తుందని లేదా ఇన్‌స్టంట్ కాఫీ వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తుందని ఇది నిరూపించదు. జీవనశైలి, ఆహారపు అలవాట్లు, జన్యుపరమైన లక్షణాలు, ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలు వంటి అనేక అంశాలు కూడా ఈ ఫలితాలపై ప్రభావం చూపి ఉంటాయని పరిశోధకులు పేర్కొన్నారు. వయస్సు అంటే సాధారణంగా పుట్టినప్పటి నుంచి గడిచిన సంవత్సరాల సంఖ్యను సూచిస్తుంది. దీనినే కాలక్రమ వయస్సు అంటారు. అయితే జీవసంబంధిత వృద్ధాప్యం అంటే శరీరంలోని కణాలు, కణజాలాలు, అవయవాలు ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయో సూచించే ప్రమాణం. ఒకే వయస్సు ఉన్న ఇద్దరిలో ఒకరి జీవసంబంధిత వయస్సు మరొకరితో పోలిస్తే తక్కువగా లేదా ఎక్కువగా ఉంటుంది. దీనిపై జన్యువులు, జీవనశైలి, ఆహారం, పర్యావరణ ప్రభావాలు, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం వంటి అంశాలు ప్రభావం చూపిస్తాయి.

### 49వేల మంది సమాచారం విశ్లేషణ..

ప్రస్తుతం శాస్త్రవేత్తలు వ్యక్తి ఆరోగ్య స్థితి, భవిష్యత్తులో వయస్సుతో వచ్చే వ్యాధుల ప్రమాదాన్ని అంచనా వేయడానికి జీవసంబంధిత వృద్ధాప్య సూచికలను ఉపయోగిస్తున్నారు. ఈ అధ్యయనంలో మూడు ప్రమాణాలను ఉపయోగించారు. రిలేటివ్ ల్యూకోసైట్ టెలోమీర్ లెంగ్త్ (ఆర్ఎల్‌టీఎల్), ఇది కణాల వృద్ధాప్యాన్ని సూచించే ప్రమాణం. టెలోమీర్‌లు చిన్నవిగా మారితే వృద్ధాప్యం, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. ఫీనోఏజ్ యాక్సిలరేషన్, క్లినికల్ బయోమార్కర్ల ఆధారంగా శరీర జీవసంబంధిత వయస్సును అంచనా వేసే విధానం. క్లెమెరా-డౌబల్ మెథడ్ బయోలాజికల్ ఏజ్ యాక్సిలరేషన్, శారీరక సూచికల ఆధారంగా జీవసంబంధిత వయస్సును అంచనా వేసే మరో గుర్తింపు పొందిన విధానం. పరిశోధకులు యూకే బయోబ్యాంక్‌కు చెందిన 49,414 మంది ఆహారపు అలవాట్లు, ఆరోగ్య సమాచారాన్ని విశ్లేషించారు. వీరి సగటు వయస్సు 56.4 సంవత్సరాలు. పాల్గొన్నవారు పలు సందర్భాల్లో కాఫీ వినియోగంపై ప్రశ్నావళిని పూర్తి చేయగా, రక్తపరీక్షలు, ఇతర క్లినికల్ ప్రమాణాల ద్వారా జీవసంబంధిత వృద్ధాప్య సూచికలను పరిశీలించారు.

### కాఫీ రకాన్ని బట్టి తేడాలు..

ఫలితాల్లో కాఫీ రకాన్ని బట్టి స్పష్టమైన తేడాలు కనిపించాయి. ఫిల్టర్ కాఫీ తాగే వారిలో జీవసంబంధిత వృద్ధాప్య వేగం తక్కువగా ఉండటంతో పాటు టెలోమీర్‌ల పొడవు ఎక్కువగా ఉండే ధోరణి కనిపించింది. దీన్ని ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి సంకేతంగా పరిశోధకులు పేర్కొన్నారు. ఇన్‌స్టంట్ కాఫీ తాగే వారిలో జీవసంబంధిత వృద్ధాప్య వేగం ఎక్కువగా ఉండటంతోపాటు టెలోమీర్‌లు చిన్నగా ఉండే ధోరణి కనిపించింది. ఇది వేగవంతమైన జీవసంబంధిత వృద్ధాప్యంతో అనుసంధానమైందని తెలిపారు. ఇతర విధానాల్లో తయారైన కాఫీల విషయంలో మాత్రం స్థిరమైన సంబంధం కనిపించలేదు. ధూమపానం, బాడీ మాస్ ఇండెక్స్, శారీరక శ్రమ, మద్యం సేవనం, కాఫీలో కలిపే పాలు లేదా చక్కెర, అలాగే మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కూడా ఈ సంబంధాలు పెద్దగా మారలేదని పరిశోధకులు వెల్లడించారు.

### కారణాలేంటి..?

ఫిల్టర్ కాఫీ ఎందుకు మెరుగైన ఫలితాలతో సంబంధం చూపిందో ఈ అధ్యయనం నిర్ధారించలేదు. అయినప్పటికీ పరిశోధకులు కొన్ని సాధ్యమైన కారణాలను వెల్లడించారు. ఫిల్టర్ కాఫీలో వందలాది బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. వాటిలో క్లోరోజెనిక్ ఆమ్లాలు, పాలీఫినాల్స్, కెఫిన్, యాంటీఆక్సిడెంట్లు ముఖ్యమైనవి. ఇవి వాపులను తగ్గించడం, ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచడం, గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడతాయని గత పరిశోధనలు సూచించాయి. అలాగే సిస్టాటిన్ సి, బేసల్ మెటబాలిక్ రేట్, గ్లైకోప్రోటీన్ అసిటైలేషన్ వంటి బయోమార్కర్లు కూడా ఈ సంబంధంలో కొంత పాత్ర పోషించినట్లు పరిశోధకులు గుర్తించారు. అంటే శరీరంలో వాపులు, జీవక్రియల ఆరోగ్యం కూడా దీనికి కారణం అయిందని తెలిపారు. యూరోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ తెలిపిన ప్రకారం ఫిల్టర్ చేయని కాఫీలో ఉండే కాఫెస్టాల్, కాహ్వియోల్ అనే సహజ సమ్మేళనాలను ఎక్కువ మోతాదులో తీసుకుంటే ఎల్‌డీఎల్ లేదా చెడు కొలెస్ట్రాల్‌ను పెంచే అవకాశం ఉంటుంది. ఫిల్టర్ పేపర్ వీటిలో గణనీయమైన భాగాన్ని తొలగిస్తుంది.

### ఇంకా స్పష్టత అవసరం..

పరిశోధకులు గమనించిన తేడాలు చాలా స్వల్పమని స్పష్టం చేశారు. జీవసంబంధిత వృద్ధాప్యంలో కనిపించిన వ్యత్యాసం సుమారు 0.1 నుంచి 0.2 సంవత్సరాల వరకు మాత్రమే ఉంది. కాబట్టి గణాంకపరంగా ఇది ప్రాముఖ్యత కలిగినప్పటికీ, వ్యక్తిగత ఆరోగ్యంపై దీని ప్రభావం ఎంత ఉంటుందో ఇప్పటికీ స్పష్టత లేదు. అలాగే ఫిల్టర్ కాఫీ తాగే వారు ఆహారం, ఆదాయ స్థాయి, నిద్ర, వ్యాయామం, వైద్య సేవల లభ్యత వంటి అనేక అంశాల్లో ఇన్‌స్టంట్ కాఫీ తాగే వారితో భిన్నంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. ఈ తేడాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకోవడం సాధ్యం కాదు. కాఫీ ప్రపంచంలో అత్యధికంగా పరిశోధించిన పానీయాల్లో ఒకటి. ప్రపంచ ఆరోగ్య సంస్థతోపాటు అనేక పెద్ద పరిశీలనా అధ్యయనాలు మితమైన మోతాదులో కాఫీ తాగడం వల్ల టైప్-2 డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం తగ్గే అవకాశం ఉందని సూచించాయి. అయితే ప్రతి వ్యక్తి శరీరం ఒకే విధంగా స్పందించదు.

### రోజూ 3 కప్పుల కాఫీతో..

ది బీఎంజేలో ప్రచురితమైన సమగ్ర విశ్లేషణ ప్రకారం రోజుకు మూడు నుంచి నాలుగు కప్పుల కాఫీ చాలా మందికి ప్రయోజనకరంగా ఉండే అవకాశం ఉంటుంది. అయితే అధిక కెఫీన్ ను తీసుకోవడం వల్ల ఆందోళన పెరగడం, నిద్రకు అంతరాయం కలగడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. గర్భిణీలు లేదా కొన్ని రకాల గుండె స్పందన సమస్యలు ఉన్నవారికి అధిక కెఫీన్ సమస్యలను సృష్టించే అవకాశాలు ఉంటాయి. కాగా ఈ అధ్యయనంలో కొన్ని ముఖ్యమైన పరిమితులు కూడా ఉన్నాయి. ఇది క్రాస్-సెక్షనల్ అధ్యయనం కావడంతో కారణం-ఫలిత సంబంధాన్ని నిర్ధారించలేదు. కాఫీ వినియోగ వివరాలు పాల్గొనేవారే స్వయంగా చెప్పడం వల్ల గుర్తింపు పొరపాట్లు ఉండే అవకాశం ఉంది. ఎక్కువ మంది పాల్గొనే వారు శ్వేతజాతి యూరోపియన్ నేపథ్యానికి చెందినవారే కావడంతో ఇతర దేశాలు, జాతులపై ఈ ఫలితాలు ఎంతవరకు వర్తిస్తాయో స్పష్టత లేదు. గణాంకపరంగా సర్దుబాట్లు చేసినప్పటికీ కొన్ని దాగి ఉన్న ప్రభావాలను పూర్తిగా తొలగించడం సాధ్యం కాదు. అలాగే నిజమైన ఆయుష్షు లేదా వ్యాధుల సంఖ్యను కాకుండా జీవసంబంధిత వృద్ధాప్య సూచికలను మాత్రమే పరిశీలించింది.

### ఆరోగ్యకరమైన జీవనశైలి కూడా అవసరం..

అందువల్ల కేవలం ఒక కాఫీ తయారీ విధానాన్ని మాత్రమే ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం సిఫార్సు చేయాలంటే ఇంకా దీర్ఘకాలిక పరిశోధనలు, క్లినికల్ పరీక్షలు అవసరమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతానికి ఈ అధ్యయనం ఫిల్టర్ కాఫీ నెమ్మదిగా జరిగే జీవసంబంధిత వృద్ధాప్యంతో సంబంధం కలిగి ఉంటుందని, ఇన్‌స్టంట్ కాఫీ మాత్రం అంత అనుకూలమైన సూచికలతో సంబంధం కలిగి ఉండదని మాత్రమే సూచిస్తోంది. అయితే ఇది కారణాన్ని నిరూపించలేదు. మరింత బలమైన శాస్త్రీయ ఆధారాలు వచ్చే వరకు సమతుల్య ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, సరిపడా నిద్ర, ధూమపానానికి దూరంగా ఉండడం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలినే పాటించాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

# ఫ్యాట్స్ అంటే ఉపయోగమే.. కానీ అతిగా తీసుకుంటేనే అనారోగ్యకరం..

భారతీయుల ఆహారపు అలవాట్లలో గత కొన్ని దశాబ్దాలుగా గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకప్పుడు ఇంట్లో వండిన సాంప్రదాయ వంటకాలే ప్రధాన ఆహారంగా ఉండేవి. ప్రస్తుతం వాటి స్థానంలో చిరు తిండ్లు, ప్యాకెట్ స్నాక్స్, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలు ఎక్కువగా చోటు దక్కించుకుంటున్నాయి. ఈ మార్పుల కారణంగా ఆహారంలో ఉపయోగించే కొవ్వుల (ఫ్యాట్స్) నాణ్యత, పరిమాణం ఆరోగ్యంపై చూపే ప్రభావం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా ఊబకాయం, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో మంచి కొవ్వులను ఎంచుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఫ్యాట్స్ ఆరోగ్యానికి హానికరమైనవే అనే అపోహ చాలా మందిలో ఉంది. అయితే శరీరానికి శక్తిని అందించడం, కణాల నిర్మాణానికి తోడ్పడడం, విటమిన్ ఎ, డి, ఇ, కె వంటి కొవ్వులో కరిగే విటమిన్లను శరీరం గ్రహించేందుకు సహాయపడటం, ఎక్కువసేపు ఆకలి అవకుండా తృప్తి కలిగించడం వంటి కీలక బాధ్యతలను ఫ్యాట్స్ నిర్వహిస్తాయి. అందువల్ల వాటిని పూర్తిగా మానేయడం కాదు, సరైన రకం, సరైన మోతాదులో తీసుకోవడమే ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

### ఎన్నో రకాలు..

మోనో అన్‌సాచ్యురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ (ఎంయూఎఫ్‌ఏ), పాలీ అన్‌సాచ్యురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ (పీయూఎఫ్‌ఏ) అధికంగా ఉండే వంటనూనెలు జీవక్రియలకు అనుకూలంగా పనిచేస్తాయి. అనేక వంటనూనెలలో కెరోటినాయిడ్లు, టోకోఫెరాల్స్, టోకోట్రియెనాల్స్, పాలీఫినాల్స్ వంటి సహజ యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఆక్సిడేటివ్ ఒత్తిడిని, వాపులను తగ్గించడంలో సహాయపడతాయి. ఉదాహరణకు పామ్ ఆయిల్‌లో కెరోటినాయిడ్లు, టోకోట్రియెనాల్స్ సమృద్ధిగా లభిస్తాయి. అదే సమయంలో సాచ్యురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ కూడా అనేక సంప్రదాయ ఆహారాలు, వంటనూనెలలో సహజంగానే ఉంటాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన పరిమితుల మేరకు తీసుకుంటే అవి కూడా సమతుల్య ఆహారంలో భాగమే అవుతాయి. ఆహారంలో ఉండే కొవ్వులను ప్రధానంగా కనిపించే కొవ్వులు (Visible Fats), కనిపించని కొవ్వులు (Invisible Fats), పారిశ్రామిక ట్రాన్స్ ఫ్యాట్స్‌గా విభజిస్తారు. బియ్యం, ధాన్యాలు, పప్పుధాన్యాలు వంటి ఆహారాల్లో సహజంగా ఉండేవి కనిపించని కొవ్వులు. నెయ్యి, వెన్న, వంటనూనెలు, వనస్పతి వంటి వంట సమయంలో కలిపేవి కనిపించే కొవ్వులు. వీటిని అధికంగా ఉపయోగించడం వల్ల రోజువారీ కొవ్వు వినియోగం తెలియకుండానే పెరిగిపోతుంది. ముఖ్యంగా నూనెలను పదేపదే వేడి చేసి వాడితే హానికరమైన ఆక్సిడేషన్ పదార్థాలు, కొంతమేర ట్రాన్స్ ఫ్యాట్స్ ఏర్పడి ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతాయి.

### ఇవి ప్రమాదకరం..

పాక్షిక హైడ్రోజనేషన్ ప్రక్రియ ద్వారా తయారయ్యే పారిశ్రామిక ట్రాన్స్ ఫ్యాట్స్ ను అత్యంత ప్రమాదకరమైనవిగా గుర్తించారు. ఇవి రక్తంలో కొవ్వుల సమతుల్యతను దెబ్బతీసి, రక్తనాళాల పనితీరును ప్రభావితం చేసి గుండె జబ్బులు, మధుమేహం వంటి సమస్యల ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతాయి. వీటివల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనం ఉండదని శాస్త్రీయ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పామ్ ఆయిల్ వంటి కొన్ని సహజంగా స్థిరంగా ఉండే నూనెలు అనేక ఆహార పదార్థాల తయారీలో పారిశ్రామిక హైడ్రోజనేషన్ అవసరం లేకుండానే ఉపయోగించవచ్చు కాబట్టి వాటిలో పారిశ్రామిక ట్రాన్స్ ఫ్యాట్స్ ఉండవు. ఈ ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని భారత్ పారిశ్రామిక ట్రాన్స్ ఫ్యాట్స్‌ను తగ్గించే దిశగా పలు చర్యలు చేపట్టింది. వంటనూనెలు, ప్రాసెస్డ్ ఆహారాల్లో ట్రాన్స్ ఫ్యాట్స్ పరిమితిని దశలవారీగా తగ్గించడం, తప్పనిసరి లేబెలింగ్ విధించడం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రపంచ ఆరోగ్య ప్రమాణాలకు అనుగుణంగా ముందడుగు వేసింది. దీనివల్ల ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పురోగతి సాధించింది.

### ట్రాన్స్ ఫ్యాట్స్‌ను తొలగించేందుకు చర్యలు..

ప్రస్తుతం ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (FSSAI) దృష్టి కేవలం హానికరమైన కొవ్వులను తొలగించడంపైనే కాకుండా, దేశవ్యాప్తంగా వినియోగించే వంటనూనెలలో కొవ్వు ఆమ్లాల సమతుల్యతను మెరుగుపరచడంపైనా ఉంది. దీనిలో పారిశ్రామిక ట్రాన్స్ ఫ్యాట్స్‌ను పూర్తిగా తొలగించడం, సమతుల్య ఫ్యాటీ యాసిడ్ కూర్పును ప్రోత్సహించడం, ఆహార పరిశ్రమలలో మార్పులు తీసుకురావడం, వినియోగదారులకు స్పష్టమైన లేబెలింగ్ ద్వారా సరైన సమాచారం అందించడం వంటి అంశాలు ఉన్నాయి. ఆహార పదార్థాలపై సాచ్యురేటెడ్ ఫ్యాట్స్, ట్రాన్స్ ఫ్యాట్స్ వివరాలను తప్పనిసరిగా ప్రకటించడం వల్ల వినియోగదారులు మంచి ఎంపిక చేసుకునే అవకాశం పెరిగింది. భవిష్యత్తులో అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు కలిగిన ఆహారాలకు ప్యాకెట్ ముందు భాగంలో హెచ్చరిక లేబెల్స్ అమలు చేసే దిశగా కూడా చర్యలు కొనసాగుతున్నాయి.

### ఏ ఒక్క వంట నూనెలో అన్ని పోషకాలు లేవు..

వ్యక్తిగత నియంత్రణ కంటే ఆరోగ్యకరమైన ఆహార వాతావరణాన్ని సృష్టించడమే దీని లక్ష్యం. 2024లో భారత వైద్య పరిశోధనా మండలి (ICMR)-జాతీయ పోషకాహార సంస్థ (NIN) విడుదల చేసిన డైటరీ మార్గదర్శకాల ప్రకారం ఏ ఒక్క వంటనూనె కూడా అన్ని పోషక అవసరాలను పూర్తిగా తీర్చలేదని పేర్కొంది. ఒమేగా-6, ఒమేగా-3 వంటి అవసరమైన ఫ్యాటీ యాసిడ్స్‌ను పొందేందుకు వివిధ రకాల నూనెలను మారుస్తూ ఉపయోగించడం లేదా శాస్త్రీయంగా సమతుల్యంగా మిళితం చేసిన నూనెలను వినియోగించడం ఉత్తమమని సూచించింది. దేశంలో గతంలో ప్రాంతానికో ప్రత్యేక వంటనూనె వినియోగించే సంప్రదాయం ఉండేది. ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో ఆవ నూనె, పశ్చిమ ప్రాంతాల్లో వేరుశెనగ నూనె, దక్షిణ భారతంలో కొబ్బరి నూనె, అలాగే నువ్వుల నూనె, పామ్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ వంటి నూనెలు ప్రాంతీయ ఆహార సంస్కృతిలో భాగంగా ఉండేవి. అయితే ఆధునిక జీవనశైలి, ప్రాసెస్డ్ ఆహారాల వినియోగం పెరగడంతో ఈ వైవిధ్యం




తగ్గిపోయింది. వివిధ రకాల నూనెలను సమతుల్యంగా ఉపయోగించడం వల్ల శరీరానికి అవసరమైన ఫ్యాటీ యాసిడ్స్ అందడంతో పాటు జీవక్రియ కూడా మెరుగుపడుతుంది. ఎఆర్‌శీటీఎ

### ఆరోగ్యకరమైన నూనెలు లభించాలి..

ఆరోగ్యకరమైన వంటనూనెలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండటం కూడా అంతే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. వీధి ఆహార విక్రేతలు, చిన్న హోటళ్లు, ఆహార తయారీ సంస్థలు, సాధారణ కుటుంబాలు ఆరోగ్యకరమైన నూనెలను వినియోగించాలంటే అవి సరసమైన ధరలో సులభంగా లభించాలి. దీనికోసం వ్యవసాయం, ఆహార పరిశ్రమ, వాణిజ్య విధానాలు, ప్రభుత్వ నియంత్రణ వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంటుంది. పిల్లలు, యువతలో అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారాల వినియోగం పెరగడం మరో ఆందోళనకర అంశంగా మారింది. అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు కలిగిన ఆహారాలు చిన్న వయసులోనే వారి రుచి అలవాట్లను ప్రభావితం చేస్తాయి. అందువల్ల స్పష్టమైన లేబెలింగ్, ప్రకటనల నియంత్రణ, పాఠశాల స్థాయిలో పోషకాహార మార్గదర్శకాలు వంటి చర్యలు భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఆహారంలో కొవ్వుల నాణ్యత వ్యక్తిగత అలవాట్లకే పరిమితమైన విషయం కాదు. ప్రజలకు అందుబాటులో ఉండే ఆహార వ్యవస్థపై కూడా అది ఆధారపడి ఉంటుంది. ఆరోగ్యకరమైన నూనెలు సులభంగా లభించేలా, స్పష్టమైన సమాచారం ఉండేలా, అందరికీ కొనుగోలు చేయగలిగే ధరలో అందుబాటులో ఉంటే ప్రజలు సహజంగానే మెరుగైన ఆహార ఎంపికలు చేసుకునే అవకాశం పెరుగుతుంది. హానికరమైన కొవ్వులను తగ్గించడంతో పాటు సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన కొవ్వులను ప్రోత్సహించడం ద్వారా దేశం ఆరోగ్యకరమైన భవిష్యత్తు వైపు అడుగులు వేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

# జింబాబ్వే గడ్డపై అడుగుపెట్టిన భారత్..




ఇంగ్లాండ్ పర్యటన ముగిసింది. ఆదివారం (జులై 19, 2025) లార్డ్స్ వేదికగా జరిగిన చివరి వన్డేలో భారత్ ఓడిపోయి.. సిరీస్ కోల్పోయింది. అయితే ఇది జరిగిన రెండు రోజుల వ్యవధిలోనే టీమిండియా మరో పర్యటనకు సిద్ధమైంది. జులై 23 నుంచి జింబాబ్వేతో 3 టీ20ల సిరీస్ జరగనుంది. ఇందుకోసం ఇప్పటికే జట్టును సెలక్టర్లు ఎంపిక చేశారు. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో టీమిండియా బరిలోకి దిగింది. ఇక ఈ సిరీస్ కోసం ఒక్క చోట చేరిన భారత ఆటగాళ్లు.. మంగళవారం (జులై 21) జింబాబ్వేలో అడుగుపెట్టారు. ఈ మేరకు భారత ఆటగాళ్లు జింబాబ్వే ప్రయాణానికి సంబంధించిన వీడియోను బీసీసీఐ.. సోషల్ మీడియాలో షేర్ చేసింది. ముంబై టు హరారే అని క్యాప్షన్ ఇచ్చింది. ఇందులో తిలక్ వర్మ, ప్రభ్ సిమ్రాన్ సింగ్, మయాంక్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, రింకూ సింగ్ తదితరులు కనిపించారు. టీమిండియా సీనియర్ జట్టుకు షెడ్యూల్ బిజీగా ఉండటంతో.. వీవీఎస్ లక్ష్మణ్ .. ఈ సిరీస్‌కు తాత్కాలిక హెడ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. జట్టుతో పాటు అతడు కూడా జింబాబ్వేకు వెళ్లాడు. భారత క్రికెట్ జట్టు ఇటీవల ముగిసిన ఇంగ్లాండ్ పర్యటనలో ఆశించిన స్థాయి ఫలితాలను సాధించలేకపోయింది. టీ20, వన్డే సిరీస్‌లలో ఓటమి పాలైన నేపథ్యంలో.. జింబాబ్వే పర్యటన కీలకంగా మారింది. యూకే పర్యటనలో ఎదురైన చేదు అనుభవాలను, చేజారిన సిరీస్‌ల పరాజయాలను పక్కన పెట్టి, జింబాబ్వేపై ఘన విజయం సాధించి మళ్లీ గెలుపు బాట పట్టాలని టీమిండియా పట్టుదలతో ఉంది. సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చిన నేపథ్యంలో, ఐపీఎల్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టిన యువ ఆటగాళ్లు.. ఈ సిరీస్‌లో తుది జట్టులోకి రానున్నారు. గౌతమ్ గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి భారత జట్టు ప్రదర్శన మిశ్రమంగా ఉంది. టీ20 వరల్డ్ కప్ గెలిచినప్పటికీ.. దశాబ్దాల తర్వాత శ్రీలంక చేతిలో ఓడటం, సొంత గడ్డ మీద న్యూజిలాండ్ చేతిలో వైట్ వాష్‌కు గురి కావడం, ఐర్లాండ్, ఇంగ్లాండ్ గడ్డ మీద సిరీస్‌లు ఓడటం లాంటివి చోటు చేసుకున్నాయి. దీంతో గంభీర్ తీరు పట్ల విమర్శలు వస్తున్నాయి. ఐస్‌లాండ్ క్రికెట్ గంభీర్ పరువు తీసేలా ట్వీట్ వేసింది. ఇప్పుడు భారత జట్టు లక్ష్మణ్ మార్గదర్శకత్వంలో జింబాబ్వే టూర్‌కు వెళ్లింది. దీని వల్ల ఇప్పటికిప్పుడు గంభీర్‌కు వచ్చిన ఇబ్బందేం లేదు. సరిపడా విశ్రాంతి తీసుకొని, ఒత్తిడి తగ్గించుకోవడానికి ఇది గంభీర్‌కు ఉపకరిస్తుంది. కానీ భవిష్యత్తు టోర్నీల్లో భారత్ మెరుగైన ప్రదర్శన చేస్తేనే గంభీర్‌పై బీసీసీఐ నమ్మకాన్ని కొనసాగిస్తుంది. లేకపోతే 2027 వరల్డ్ కప్ తర్వాత అతడిపై వేటు పడే అవకాశం ఉంది.

# స్పెయిన్‌కు సుమారు రూ.430 కోట్ల ప్రైజ్ మనీ



2026 ఫిఫా ప్రపంచకప్‌కు ఘన ముగింపు లభించింది. అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రం ఈస్ట్ రూథర్‌ఫోర్డ్‌లో ఉన్న మెట్లైఫ్ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్ 1–0 తేడాతో అర్జెంటీనాను ఓడించి ప్రపంచ విజేతగా అవతరించింది. నాలుగేళ్ల క్రితం ఖతార్‌లో సాధించిన టైటిల్‌ను నిలబెట్టుకోవాలన్న అర్జెంటీనా ఆశలు ఫైనల్లోనే ఆగిపోయాయి. మరోవైపు యువ ఆటగాళ్లతో బలంగా కనిపించిన స్పెయిన్ చరిత్రలో రెండోసారి ప్రపంచకప్‌ను ముద్దాడింది. ఈ విజయంతో స్పెయిన్‌కు ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యున్నత గౌరవంతో పాటు భారీ ఆర్థిక లాభం కూడా దక్కింది. ఫిఫా ప్రకటించిన రికార్డు స్థాయి ప్రైజ్ ఫండ్‌లో విజేతగా నిలిచిన స్పెయిన్‌కు 50 మిలియన్ అమెరికన్ డాలర్లు లభించనున్నాయి. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.430 కోట్లకు సమానం. పురుషుల ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో విజేతకు లభించిన అత్యధిక ప్రైజ్ మనీ ఇదే కావడం విశేషం. ఫైనల్లో ఓడిపోయినా అర్జెంటీనా ఖాళీ చేతులతో వెళ్లలేదు. రన్నరప్‌గా నిలిచిన ఆ జట్టుకు 33 మిలియన్ డాలర్లు దక్కనున్నాయి. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.284 కోట్లకు సమానం. 2022 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన ఫ్రాన్స్ పొందిన మొత్తంతో పోలిస్తే ఇది మరింత ఎక్కువ. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్‌పై ఇంగ్లండ్ విజయం సాధించింది. దీంతో ఇంగ్లండ్‌కు 29 మిలియన్ డాలర్లు (సుమారు రూ.249 కోట్లు), నాలుగో స్థానంలో నిలిచిన ఫ్రాన్స్‌కు 27 మిలియన్ డాలర్లు (సుమారు రూ.232 కోట్లు) ప్రైజ్ మనీ లభించనుంది.ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినో నేతృత్వంలోని ఫిఫా కౌన్సిల్ 2025 డిసెంబరులో ప్రకటించిన వివరాల ప్రకారం, 2026 ప్రపంచకప్ కోసం మొత్తం 655 మిలియన్ డాలర్ల ప్రైజ్ ఫండ్‌ను కేటాయించింది. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.5,630 కోట్లకు సమానం. 2022 ప్రపంచకప్‌తో పోలిస్తే ఇది దాదాపు 50 శాతం అధికం. అంతేకాకుండా టోర్నమెంట్‌కు అర్హత సాధించిన ప్రతి జట్టుకు సిద్ధత ఖర్చుల కోసం అదనంగా 1.5 మిలియన్ డాలర్లు కూడా అందజేశారు. అంటే సుమారు రూ.13 కోట్లకు పైగా ప్రతి జట్టుకు ముందుగానే లభించింది. టోర్నమెంట్‌లో వ్యక్తిగత అవార్డుల విభాగంలో ఫ్రాన్స్ స్టార్ స్ట్రైకర్ కిలియన్ ఎంబాపే మెరిశాడు. మొత్తం 10 గోల్స్ చేసి గోల్డెన్ బూట్ అవార్డును సొంతం చేసుకున్నాడు. అతడు నాలుగు అసిస్ట్‌లు కూడా నమోదు చేశాడు. అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ ఎనిమిది గోల్స్, నాలుగు అసిస్ట్‌లతో రెండో స్థానంలో నిలిచాడు. ఈ ప్రపంచకప్‌తో ఎంబాపే తన కెరీర్ వరల్డ్‌కప్ గోల్స్ సంఖ్యను 22కు పెంచుకున్నాడు. దీంతో 21 వరల్డ్‌కప్ గోల్స్‌తో ఉన్న మెస్సి రికార్డును అధిగమించిన ఆటగాడిగా నిలిచాడు.ప్రపంచకప్ విజేత స్పెయిన్ జట్టును ముందుండి నడిపించిన కెప్టెన్ రోడ్రీకి గోల్డెన్ బాల్ అవార్డు దక్కింది. టోర్నమెంట్ మొత్తం స్పెయిన్ ఆటను నియంత్రించడంలో, మిడ్‌ఫీల్డ్‌లో ఆధిపత్యం చెలాయించడంలో రోడ్రీ కీలక పాత్ర పోషించాడు. టోర్నమెంట్‌లో అత్యధిక పాస్‌లు పూర్తి చేసిన ఆటగాడిగా కూడా అతడు రికార్డు సృష్టించాడు. స్పెయిన్ రెండోసారి ప్రపంచకప్ గెలవడంలో రోడ్రీ ప్రదర్శన ప్రధాన కారణంగా నిలిచింది.

# హిట్‌మ్యాన్‌ను పొగడ్తలతో ముంచెత్తిన రవిశాస్త్రి



లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డే మ్యాచ్ కంటే ముందు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాడు. 2027 వన్డే ప్రపంచకప్ వైపు చూస్తున్న భారత సెలెక్టర్లు, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. రోహిత్ శర్మను ఇకపై జట్టులోకి తీసుకోకపోవచ్చని, లార్డ్స్ మ్యాచ్ అతనికి ఆఖరిది కానుందంటూ వార్తలు వచ్చాయి. అయితే 39 ఏళ్ల రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌లో విశ్వరూపం చూపించాడు. వింటేజ్ ఆటతో ఇంగ్లాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. దీంతో తనపై విమర్శలు గుప్పించిన వారి నోళ్లను హిట్ మ్యాన్ మూయించాడు.మైదానం నలుమూలలా బాదుతూ రోహిత్ శర్మ ఆడిన షాట్లు లార్డ్స్ మైదానాన్ని హోరెత్తించాయి. తొలి రెండు వన్డేల్లో 11, 26 పరుగులు మాత్రమే చేసి విఫలమైన రోహిత్, ఆఖరి వన్డేలో అద్భుతంగా పుంజుకున్నాడు. 110 బంతుల్లో 138 పరుగులు స్కోరు చేశాడు. ఇందులో 5 సిక్స్‌లు, 17 ఫోర్లు ఉన్నాయి. ఈ ఇన్నింగ్స్‌పై భారత మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి స్పందించాడు. రోహిత్ శర్మ తనకు తానుగా కొత్తగా నిరూపించుకోవాల్సింది ఏమీ లేదని, తన అద్భుతమైన సెంచరీతో విమర్శకుల నోళ్లను శాశ్వతంగా మూయించేశాడని రవిశాస్త్రి పేర్కొన్నాడు. ఒక ఆటగాడు జట్టుకు అంత సేవ చేసిన తర్వాత ఇలాంటి రూమర్లు రావడం విసుగు కలిగిస్తుందని రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు. రోహిత్ శర్మలో ఇంకా ఆడేందుకు కసి ఉన్నన్ని రోజులు అతడికి అవకాశం ఇవ్వాలని.. సెలెక్టర్లను కోరాడు. తనకు ఇక ఆడే సామర్థ్యం లేదని రోహిత్ భావించిన రోజే అతడే స్వయంగా తప్పుకుంటాడని రవిశాస్త్రి స్పష్టం చేశాడు. మరోవైపు తన రీఎంట్రీ ఇన్నింగ్స్ పై రోహిత్ శర్మ బీసీసీఐ అప్‌లోడ్ చేసిన వీడియోలో స్పందించాడు. బయట వచ్చే విమర్శలు, కామెంట్లు తనకు అనవసరమని, మైదానంలోకి వెళ్లి పరుగులు సాధించడమే తన బాధ్యత అని రోహిత్ చెప్పాడు. విమర్శలు లేకపోతే కిక్కు ఉండదని, బయట వారు చేసే పని వారు చేస్తుంటే, మైదానంలో తాను చేయాల్సిన పని తాను చేస్తానని ధీమా వ్యక్తం చేశాడు.

## భారత్, జింబాబ్వే సిరీస్ షెడ్యూల్..

తొలి టీ20: జులై 23 – హరారే స్పోర్ట్స్ క్లబ్
రెండో టీ20: జులై 25 – హరారే స్పోర్ట్స్ క్లబ్
మూడో టీ20: జులై 26 – హరారే స్పోర్ట్స్ క్లబ్

జింబాబ్వే పర్యటనకు భారత టీ20 జట్టు..

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, సూర్యాన్ష్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్)





# హాకీ వరల్డ్‌కప్‌నకు భారత జట్టు ప్రకటన



2026 హాకీ ప్రపంచకప్? టోర్నమెంట్?కు హాకీ ఇండియా భారత జట్టును మంగళవారం ప్రకటించింది. 20 మంది సభ్యులతో కూడిన జట్టుకు హర్మన్?ప్రీత్ సింగ్ కెప్టెన్?గా వ్యవహరించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ వచ్చే నెల 15న ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్?లకు నెదర్లాండ్స్, బెల్జియం సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ టోర్నీలో భారత్ పూల్ డీలో ఉంది. ఈ గ్రూప్?లో భారత్?తోపాటు ఇంగ్లాండ్, పాకిస్థాన్, వేల్స్ జట్లు ఉన్నాయి. పురుషుల టోర్నీలో 16 జట్లు పోటీలో ఉన్నాయి. నాలుగేసి జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రపంచ కప్ జట్టు ఎంపికపై టీమ్ హెడ్ కోచ్ ఫుల్టన్ మాట్లాడారు. 'ఇది చాలా సమతుల్యమైన జట్టు. ఇందులో అనుభవం ఉన్న ఆటగాళ్లు ఉన్నారు. అలాగే అద్భుతమైన ఫామ్‌లో ఉన్న యువ ఆటగాళ్లూ ఉన్నారు. ఈ ఇద్దరితో టీమ్ బ్యాలెన్స్?గా ఉంది. భారత్ ప్రపంచ కప్ గెలిచి 50 ఏళ్లు పూర్తయింది. అందుకే ఇది మాకు ఒక ప్రత్యేకమైన ఎడిషన్ కానుంది. ఆ చరిత్ర ఈ వరల్డ్?కప్?నకు మాకు ప్రేరణ ఇస్తుంది. ఒత్తిడిలో చురుకైన నిర్ణయాలు తీసుకోవడం, మంచి ఔట్?పుట్ ఇవ్వడంపైనే మేం దృష్టి పెట్టాము. మా ప్లేయర్లకు ఆట పట్ల నిబద్ధత ఉంది. వారు తమమత అత్యుత్తమ ప్రదర్శననిస్తూ, జట్టులో ఒకరినొకరు ప్రోత్సహించుకుంటున్నారు. పోటీ ఎంత కఠినంగా ఉంటుందో మాకు తెలుసు. కానీ మా ఆటపై మాకు నమ్మకం ఉంది. మా స్ట్రాటజీ సింపుల్. ఆటపైనే పూర్తి దృష్టి పెట్టడం, పూర్తి స్థాయిలో నిమగ్నమవుతూ టైటిల్ సాధించడమే మా టార్గెట్' అని కోచ్ అన్నారు. పురుషుల హాకీ వరల్డ్?కప్ 1971లో ప్రారంభం కాగా ఆ ఎడిషన్? (తొలి)లో భారత్ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. రెండో ఎడిషన్??లో రన్నరప్?గా నిలిచింది. అయితే మూడో ఎడిషన్? (1975లో) ఫైనల్?లో పాకిస్థాన్?ను ఓడించిన టీమ్‌ఇండియా టైటిల్? ముద్దాడింది. అర్జిత్ పాల్ సింగ్ కెప్టెన్సీలో టీమ్‌ఇండియా 2–1 తేడాతో పాక్?ను ఓడించింది. ఇక ఆ తర్వాత భారత్ మళ్లీ ఈ టోర్నీలో టైటిల్ అందుకోలేదు. గత ఎడిషన్ (2023) భారత్ తొమ్మిదో స్థానానికి పరిమితమైంది. ఈసారి బలమైన జట్టుతో భారత్ బరిలోకి దిగుతోంది. 50ఏళ్ల నాటి మ్యాజిక్?ను రిపీట్ చేసి రెండోసారి ఈ టైటిల్?ను సాధించడమే లక్ష్యంగా హర్మన్?ప్రీత్ సేన వరల్డ్?కప్?లో ఆడనుంది.జట్టు ప్రకటన సందర్భంగా కెప్టెన్ హర్మన్?ప్రీత్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఈసారి పక్కా 'కప్పును ఇంటికి తీసుకొస్తాం' అని ధీమాగా చెప్పాడు. 'వరల్డ్?కప్?ను మరోసారి పక్కా మన ఇంటికి (భారత్?కు) తీసుకొస్తాం. దేశాన్ని గర్వపడేలా చేసేందుకు మాకు ఇదొక మంచి అవకశం' అని హర్మన్?ప్రీత్ అన్నాడు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
బుధవారం
22 జూలై 2026




# షూటింగ్‌లో గాయపడ్డ బాలయ్య

నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం గోపిచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమా చేస్తుండగా, ఈ చిత్ర షూటింగ్ తాజాగా కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతుంది. అయితే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసరాలలో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా, ఆయన అనుకోకుండా కాలు జారి కిందపడిపోయారు. దాంతో ఆయన మోకాలిక స్వల్ప గాయం అయింది. వెంటనే చిత్ర బృందం షూటింగ్ ఆపేసి బాలయ్యని సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన వైద్య బృందం ఇతర పరీక్షలు కూడా నిర్వహించారు. స్వల్ప గాయమే అయిందని, కంగారు పడాల్సిన పనిలేదని వైద్యులు స్పష్టం చేశారు. అయితే కొన్ని రోజుల పాటు బాలయ్య విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్టు సమాచారం. ఇక సినిమాల విషయానికి వస్తే.. గోపిచంద్ మలినేనితో పాటు కొరటాల దర్శకత్వంలోను బాలయ్య ఓ చిత్రం చేస్తున్నాడు. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని యువసుధ ఆర్ట్స్, ఎస్ఎల్‌వీ సినిమాస్ సంస్థలు భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నాయి. బాలకృష్ణ ఈ సినిమాలో గత చిత్రాలకు భిన్నమైన లుక్‌లో కనిపించనున్నారని, మాఫియా బ్యాక్‌డ్రాప్‌తో కూడిన మాస్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కుతుందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వచ్చే ఏడాది సమ్మర్‌లో సినిమాను విడుదల చేయాలనే లక్ష్యంతో మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.



# రామ్‌చరణ్‌తో సుకుమార్ మూవీ

## హీరోయిన్‌గా రష్మిక అంటూ ప్రచారం

క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కాంబినేషన్‌లో మరో భారీ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' ఇండస్ట్రీ హిట్‌గా నిలవడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం సినిమా స్క్రిప్ట్ పూర్తిగా సిద్ధమైనట్లు తెలుస్తుండగా, ఇప్పుడు హీరోయిన్ ఎంపిక టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే సుకుమార్ కెరీర్‌ను పరిశీలిస్తే ఒక ఆసక్తికరమైన విషయం కనిపిస్తుంది. 'ఆర్య' నుంచి 'పుష్ప 2' వరకు ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమాలో కొత్త హీరోయిన్‌కే అవకాశం ఇచ్చారు. ఒకసారి నటించిన కథానాయికను వెంటనే మరో సినిమాలో రిపీట్ చేయలేదు. ఇదే ఆయనకు సెంటిమెంట్‌గా మారింది. అయితే ఈసారి రామ్ చరణ్ సినిమా కోసం ఆ సెంటిమెంట్‌ను పక్కన పెట్టే ఆలోచనలో ఉన్నారని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం పలువురు నటీమణుల పేర్లు పరిశీలించినప్పటికీ, రష్మిక మందన్న పేరు ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. దర్శకుడు సుకుమార్‌తో 'పుష్ప', 'పుష్ప 2' చిత్రాల్లో రష్మిక సక్సెస్‌ఫుల్‌గా పనిచేయడంతో, మరోసారి ఆమెనే ఎంపిక చేయాలనే అభిప్రాయం టీమ్‌లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. రామ్ చరణ్, రష్మిక మందన్న ఇప్పటివరకు ఏ సినిమాలోనూ కలిసి నటించలేదు. ఈ ఫ్రెష్ పెయిర్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని చిత్రబృందం భావిస్తోందట. అంతేకాకుండా ప్రస్తుతం రష్మిక పాన్ ఇండియా స్థాయిలో వరుస విజయాలతో దూసుకుపోతుండటం కూడా నిర్మాతలకు అదనపు బలంగా మారింది. ఆమె క్రేజ్ సినిమాకు అన్ని భాషల్లో మంచి బిజినెస్‌కు దోహదపడుతుందనే అంచనాలు ఉన్నాయి. ఒకవేళ రష్మికనే హీరోయిన్‌గా ఖరారు చేస్తే, సుకుమార్ తన కెరీర్‌లో తొలిసారి ఒకే హీరోయిన్‌ను వరుసగా రెండు చిత్రాల్లో తీసుకున్న దర్శకుడిగా నిలుస్తారు. అయితే ప్రస్తుతం ఇవన్నీ ప్రచారంలో ఉన్న వార్తలే. చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే హీరోయిన్ ఎంపికపై పూర్తి స్పష్టత రానుంది.







# టాక్సిస్ నుంచి మనసాగదే.. పాట విడుదల

యశ్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'టాక్సిక్' గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 26న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. చిత్ర ప్రచారంలో భాగంగా 'మనసాగదే.. ' అంటూ సాగే పాటను చిత్ర బృందం తాజాగా విడుదల చేసింది. తనిష్ బాగ్చీ, అర్సాన్ నిజామి, ఫహీమ్ అబ్దుల్లా స్వరాలు సమకూర్చిన ఈ పాటకు రామ జోగయ్యశాస్త్రి సాహిత్యం అందించారు. సిద్దార్థ్ బస్రూర్ ఆలపించారు. యశ్‌తో (జజీబర) పాటు, నయనతార, కియారా అద్వాణీ, హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్‌లు ఈ మూవీలో నటిస్తున్నారు ఓ సరికొత్త యాక్షన్ డ్రామాగా గీతూ మోహన్ దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు అర్థమవుతోంది.

# ఎన్టీఆర్,త్రివిక్రమ్ గాడ్ ఆఫ్ వార్ హీరోయిన్‌గా కియారాపై చర్చ

యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో 'గాడ్ ఆఫ్ వార్' ఒకటి. స్టార్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కించనున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచగా.. ఇప్పుడు హీరోయిన్‌కు సంబంధించిన వార్తలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ కియారా అద్వానీ పేరును పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ చిత్రం పురాణ గాథల స్ఫూర్తితో రూపొందనున్న మైథలాజికల్ యాక్షన్ డ్రామా అని వార్తలు వస్తుండగా.. ఎన్టీఆర్ ఇందులో శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నట్లు టాక్. కథలో కీలకమైన మహిళా పాత్రకు కియారా సరిపోతారని మేకర్స్ భావిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎన్టీఆర్, కియారా అద్వానీ ఇప్పటికే 'వార్ 2' చిత్రంలో కలిసి నటించిన సంగతి తెలిసిందే. అయితే ఆ సినిమాలో వారి మధ్య పూర్తి స్థాయి జోడీ కనిపించలేదు. కియారా నటించిన 'భరత్ అనే నేను' ఘన విజయం సాధించగా, రామ్ చరణ్‌తో చేసిన 'వినయ విధేయ రామ', 'గేమ్ ఛేంజర్' ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయాయి. దీంతో కొందరు అభిమానులు ఈ విషయాన్ని సోషల్ మీడియాలో సెంటిమెంట్‌గా చర్చిస్తున్నారు. నటుడు సిద్ధార్థ్ మల్హోత్రాను వివాహం చేసుకున్న తర్వాత కూడా వరుస ప్రాజెక్టులతో బిజీగా కొనసాగుతున్నారు. మరోవైపు ఎన్టీఆర్ ప్రస్తుతం దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'డ్రాగన్' షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమా పూర్తయిన తర్వాతే



త్రివిక్రమ్ దర్శకత్వంలోని 'గాడ్ ఆఫ్ వార్' సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని సమాచారం.

# పంద్రాగస్ట్ పోటీలో సూర్య, నయనతార

తమిళ సినీ పరిశ్రమలో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోరు జరగనుంది. గతంలో 'గజిని', 'ఆధవన్', 'మాస్సు ఎంగిర మసిలామణి' వంటి చిత్రాల్లో కలిసి నటించిన స్టార్ హీరో సూర్య, లేడీ సూపర్ స్టార్ నయనతార ఇప్పుడు ఒకరికి ఒకరు బాక్సాఫీస్ ప్రత్యర్థులుగా మారబోతున్నారు.సూర్య హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ / సన్స్' మరియు నయనతార ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'హాయ్ ' చిత్రాలు రెండూ ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్నాయి. దీంతో స్వాతంత్ర్య దినోత్సవ సెలవులను లక్ష్యంగా చేసుకుని ఈ రెండు సినిమాలు నేరుగా పోటీ పడనున్నాయి. మొదట 'విశ్వనాథ్ / సన్స్' చిత్రాన్ని ఆగస్టు 14న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అనంతరం నయనతార నటించిన 'హాయ్' మూవీ మేకర్స్ కూడా అదే తేదీని రిలీజ్ డేట్‌గా ప్రకటించడంతో బాక్సాఫీస్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది. 'హాయ్' చిత్రానికి లోకేష్ కనగరాజ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన విష్ణు ఏడవన్ దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కవిన్ హీరోగా నటిస్తుండగా, కె. భాగ్యరాజ్, రాధికా శరత్‌కుమార్, ప్రభు, వీటీవీ గణెళిష్, సత్యన్, అమృత శ్రీనివాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని రౌడీ పిక్చర్స్, 7 స్క్రీన్ స్టూడియో, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మరోవైపు 'విశ్వనాథ్ / సన్స్' చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలతో కూడిన హృద్యమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. ఒకవైపు ఫ్యామిలీ డ్రామాతో సూర్య, మరోవైపు రొమాంటిక్ కామెడీతో నయనతార ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో ఈ రెండు సినిమాల మధ్య బాక్సాఫీస్ పోటీ ఎలా ఉండబోతుందనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది. స్వాతంత్ర్య దినోత్సవ వీకెండ్‌లో తమిళ సినీ పరిశ్రమలో ఈ క్లాష్ హాట్ టాపిక్‌గా మారింది.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**